TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 78 | హైదరాబాద్ | ఆదివారం 06-09-2026 | పేజీలు: 08

## మోసపూరిత పాలన విద్యార్థి, నిరుద్యోగ గర్జన!


3

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
## 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి



- కేరళలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం
- త్రిశూర్ జిల్లాలో విషాదకర ఘటన
- హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ప్రమాద ధాటికి నుజ్జునుజ్జయిన కారు
- కారులో ఉన్న ఎనిమిది మంది మృత్యువాత
- ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరి మృతి
- మృతులంతా తమిళనాడు విద్యార్థులుగా గుర్తింపు

2



## కేసీఆర్ రాజీనామా చేయాలి

- ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగడం ఎందుకు?
- ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడం లేదని మంత్రి విమర్శ
- కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో 6న ఇందిరాపార్క్‌లో మహా ధర్నా
- మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు
- హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ

2



## తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా?

- కేసీఆర్ రాజీనామాకు కాంగ్రెస్ నేతల డిమాండ్‌పై కేటీఆర్ ఆగ్రహం
- తెలంగాణ తెచ్చిన నాయకుడు రాజీనామా చేయాలా? అని ప్రశ్న
- కరీంనగర్‌లో యువ సమరభేరీ కార్యక్రమంలో ప్రసంగం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే బర్తరఫ్ చేస్తారన్న కేటీఆర్
- ఒక్క మంత్రిని తొలగించడం పరిష్కారం కాదని వ్యాఖ్య
- నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని విమర్శ
- ప్రభుత్వ పాలనలో విజన్ కంటే విధ్వంసమే ఉందని ఆరోపణ
- ఉద్యోగాలు అడిగితే నిరుద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని మండిపాటు
- నోటిఫికేషన్ల స్థానంలో లూటిఫికేషన్ చేస్తున్నారని ఎద్దేవా
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న కేటీఆర్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఆయన రాజీనామా చేయాలా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. కరీంనగర్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

**ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేస్తారు**

ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్నే ప్రజలు బర్తరఫ్ చేసే రోజులు దగ్గరలో ఉన్నాయని కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం మిగతా 2లో..

# రెండేళ్లు సహకరించండి ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా

- పీఆర్సీ, ఇంక్రిమెంట్ల సమస్యల పరిష్కారానికి హామీ
- విద్యా వ్యవస్థను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం పిలుపు
- ఉపాధ్యాయులే విద్యా సంస్కరణలకు కథానాయకులని వ్యాఖ్య
- రెండేళ్లలో అడక్కుండానే సమస్యలు పరిష్కరిస్తానని వెల్లడి
- ఉపాధ్యాయులు ధర్నాలకు దిగడం తప్పుడు సంకేతమని వ్యాఖ్య
- బదిలీలు, పదోన్నతులు, 317 జీవో సమస్యలు పరిష్కరించామని వెల్లడి
- ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయని ప్రకటన
- పాలిటెక్నిక్‌లో థియరీతోపాటు కార్పొరేట్ ఇంటర్న్‌షిప్‌లు
- నైపుణ్య విద్యతో ప్రపంచ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచన
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్లు చెల్లించామని వెల్లడి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రెండేళ్లపాటు సహకరించి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తే ఉపాధ్యాయుల పీఆర్సీ, ఇంక్రిమెంట్లతోపాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టే దిశగా సంస్కరణలు చేపడుతున్నామని, ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు వీధుల్లోకి వచ్చి ధర్నాలు చేయడం ప్రభుత్వానికి, రాష్ట్రానికి శుభసూచకం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. "ముఖ్యమంత్రిగా విజ్ఞప్తి చేస్తున్నా.. రెండేళ్లు సమయం ఇవ్వండి. ఉపాధ్యాయులు, లెక్చరర్లకు అణాపైసా కష్టం రానివ్వను. పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు ఇతర సమస్యల్లోనూ ఇబ్బంది రానివ్వను" అని స్పష్టం చేశారు. సలహాదారు కే. కేశవరావుతో కూర్చొని సమస్యలపై చర్చించాలని సూచించారు.

**ఉపాధ్యాయులదే కీలక పాత్ర**

తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టడంలో ఉపాధ్యాయులే కథానాయకులని సీఎం అన్నారు. ఇంట్లో తమ పిల్లల భవిష్యత్తు గురించి ఏ విధంగా శ్రద్ధ తీసుకుంటారో, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విషయంలోనూ అదే శ్రద్ధ చూపాలని కోరారు. ఉపాధ్యాయులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. గత ప్రభుత్వంలో పదేళ్లపాటు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ పరిస్థితి నుంచి విద్యా రంగాన్ని వికాసం వైపు తీసుకెళ్లే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి మిగతా 2లో..

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

- ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం
- స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు
- విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత


2

## సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే

- ఆమెను కాపాడేందుకు ప్రయత్నించామన్న టీపీసీసీ చీఫ్
- బర్తరఫ్ విషయంలో హైకమాండ్ అంగీకరించలేదని వెల్లడి
- ఢిల్లీ పరిణామాలపై మీడియా చిట్‌చాట్‌లో మహేశ్ కీలక వ్యాఖ్యలు
- సురేఖ విషయంలో అందరం తమ వంతు ప్రయత్నం చేశామని వెల్లడి
- ఇప్పట్లో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉండదని స్పష్టీకరణ
- ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదన్న మహేశ్
- కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగిందని వెల్లడి
- మంత్రివర్గ విస్తరణ నిర్ణయం సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమేనని వ్యాఖ్య



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమేనని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మిగతా 2లో..

## తెలంగాణలో కేబినెట్ విస్తరణ ఎప్పుడు..? ఎవరికీ ఛాన్స్..?

- కేబినెట్‌లో మూడుకు పెరిగిన ఖాళీల సంఖ్య..
- అసెంబ్లీ ముగిసిన తర్వాత కేబినెట్ గురించి ఆలోచిస్తారా..?..
- కేబినెట్ విస్తరణకు అధిష్టానం నుంచి అనుమతి..?..
- బీసీ సామాజికవర్గం నుంచి ముందువరుసలో ఆది శ్రీనివాస్..
- రెడ్డి కోటాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు..
- పరిశీలనలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు కూడా..
- లంబాడాలకు ఇచ్చేట్టు అయితే రేసులో బాలునాయక్..?..



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో త్వరలోనే కేబినెట్ విస్తరణ ఉండొచ్చన్న ఊహాగానాలు పెరిగిపోయాయి. ఇన్నాళ్లు కేబినెట్‌లో మిగతా 2లో..



## 22ఏ భూములపై 30 శాతం కమీషన్

- లక్షలాది ఎకరాలు 22ఏ నిషేధిత జాబితాలోకి
- పేద, మధ్యతరగతి భూ యజమానులు అల్లాడుతున్నారని వ్యాఖ్య
- భూముల తొలగింపునకు 30 శాతం కమీషన్ అడుగుతున్నారని ఆరోపణ
- రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని రామచందర్‌రావు విమర్శ
- వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- కేసీఆర్ కుటుంబం దోచుకుందని రామచందర్‌రావు విమర్శ
- రేవంత్‌రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారని తీవ్ర ఆరోపణ
- 22ఏ జాబితా నుంచి భూములు తక్షణమే తొలగించాలని డిమాండ్
- లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని బీజేపీ హెచ్చరిక

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భూభారతి, 22ఏ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో లక్షలాది ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

**భూముల తొలగింపునకు కమీషన్**

22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తొలగించాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారని రామచందర్‌రావు ఆరోపించారు. రెవెన్యూ వ్యవస్థ మొత్తం క్షీణించిపోయిందని విమర్శించారు. ఈ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని మిగతా 3లో..



## విద్యార్థులను ఫోన్‌కు దూరంగా ఉంచాలి..

- చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి
- విద్యార్థుల దైనందిన జీవితంపైనా టీచర్లు శ్రద్ధ చూపాలి
- ఉమ్మడి కుటుంబాలు తగ్గుతున్న వేళ ఉపాధ్యాయులదే కీలక పాత్ర
- పిల్లల అలవాట్లను ఎప్పటికప్పుడు గమనించాలి
- మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులను కాపాడాలి
- స్క్రీన్ సమయాన్ని తగ్గించేందుకు క్రీడలను ప్రోత్సహించాలి
- కొత్త సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- ప్రతి చిన్నారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి
- తరగతి గదితో పాటు సమాజంపై అవగాహన కల్పించాలి
- సిలబస్‌తో పాటు నైతిక విలువలను నేర్పాలి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

విద్యార్థులకు చదువుతో పాటు *క్రీడలు, సృజనాత్మకతపై ఆసక్తిని పెంపొందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ* ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరిమితం చేయకుండా వారి ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహించాలని చెప్పారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయిలో మిగతా 3లో..

## 22ఏ జాబితా నుంచి ప్రజల ఇళ్లను తొలగించాలి

- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీపై ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం
- 1500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రజల ఆవేదన
- ప్రభుత్వ అనుమతులతోనే కాలనీ నిర్మాణం జరిగిందన్న ఎంపీ
- 55 ఎకరాల్లో సింఫనీ హోమ్స్ నిర్మించారని వెల్లడి
- 12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీని ఎలా చేర్చారన్న ప్రశ్న
- రుణాలు తీసుకుని కట్టుకున్న ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆగ్రహం
- రేవంత్‌రెడ్డి ఇల్లు 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారని నిలదీత
- అధికారుల తప్పులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్న ఎంపీ
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్


2

## వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు

### కాంగ్రెస్ పాలనలో రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారన్న హరీశ్‌రావు

- దుబ్బాకలో 'రైతు పోలికేక' కార్యక్రమంలో మాజీ మంత్రి విమర్శలు
- తెలంగాణ కోసం పోరాడిన తాము మళ్లీ రోడ్లపైకి వచ్చామన్న వ్యాఖ్య
- 24 గంటల విద్యుత్ ఐదారు గంటలకు పడిపోయిందని ఆరోపణ
- ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్‌గా మారిందని ఎద్దేవా
- మూడేళ్లలో రూ.29 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టారన్న ఆరోపణ
- రైతు బీమాను కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ చేసిందని విమర్శ
- కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్ సర్కారు నిర్లక్ష్యం చేసిందన్న హరీశ్‌రావు
- ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. రేవంత్ తెచ్చిన కరవు అని వ్యాఖ్య

### రైతుబంధు మళ్లీ రావాలంటే కేసీఆర్ అధికారంలోకి రావాలన్న హరీశ్‌రావు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా రాబందు, రాక్షస పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనల్లో మిగతా 2లో..

## తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా?



**మొదటిపేజీ తరువాయి**

లేదని విమర్శించారు.

**నిరుద్యోగులను నిండా ముంచారు**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు సరైన అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఉద్యోగాలు అడిగితే ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

**విజన్ కాదు.. విధ్వంసం**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విజన్ కాకుండా విధ్వంసమే కనిపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్తు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

**నోటిఫికేషన్లపై ఎద్దేవా**

ఉద్యోగ నోటిఫికేషన్ల గురించి అడిగితే ప్రభుత్వం లూటిఫికేషన్ చేస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యువత, నిరుద్యోగుల తరపున బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమే

**మొదటిపేజీ తరువాయి**

తెలిపారు. సురేఖను కాపాడేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని, ఆమె విషయంలో అందరం తమవంతు ప్రయత్నం చేశామని చెప్పారు. అయితే ఈ విషయంలో హైకమాండ్ అంగీకరించలేదని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన పరిణామాలపై శనివారం నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో మహేశ్ గౌడ్ మాట్లాడారు.

**కేబినెట్ విస్తరణపై స్పష్టత**

ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపైనే చర్చ జరిగినట్లు తెలిపారు. కేబినెట్ విస్తరణ ఎప్పుడు చేపట్టాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమని పేర్కొన్నారు.

**మంత్రి పదవిపై సమాచారం లేదు**

తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపై ఎలాంటి సమాచారం లేదని మహేశ్ గౌడ్ తెలిపారు. హైకమాండ్ నుంచి కేబినెట్ విస్తరణకు సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని మహేశ్ గౌడ్ అన్నారు. కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించామని తెలిపారు.

**బీసీ హక్కుల కోసం గర్జన**

బీసీ హక్కుల కోసం రాబోయే వంద రోజుల పాటు దేశవ్యాప్తంగా 'బీసీ హక్కుల గర్జన' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. బీసీల హక్కుల కోసం చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
## 8 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

- **కేరళలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం**
- **త్రిశూర్ జిల్లాలో విషాదకర ఘటన**
- **హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు**
- **ప్రమాద ధాటికి నుజ్జునుజ్జయిన కారు**
- **కారులో ఉన్న ఎనిమిది మంది మృత్యువాత**
- **ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం**
- **ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరి మృతి**
- **మృతులంతా తమిళనాడు విద్యార్థులుగా గుర్తింపు**
- **అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానం**
- **ప్రమాదంపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు**

**కేరళ, (ప్రజాక్షేత్రం):**

కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. త్రిశూర్ జిల్లాలో హైవేపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. కైపమంగళం ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది.

**లారీని ఢీకొన్న కారు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు గురువాయూర్ నుంచి కొడుంగళూరు వెళ్తోంది. కైపమంగళం ప్రాంతంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో మొత్తం ఎనిమిది మంది ఉన్నారు.

**ఏడుగురు అక్కడికక్కడే**

ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా దెబ్బతిన్న కారులో చిక్కుకున్న వారిని అతికష్టమ్మీద బయటకు తీశారు. అయితే అప్పటికే ఏడుగురు మృతిచెందినట్లు గుర్తించారు. తీవ్ర గాయాలపాలైన మరో వ్యక్తిని ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

**తమిళనాడు విద్యార్థులు**

మృతులంతా తమిళనాడులోని దిండిగుల్ ప్రాంతంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. మృతుల పేర్లు, ఇతర వ్యక్తిగత వివరాలు ఇంకా వెల్లడించలేదు.

**అతివేగమే కారణమా?**

కారు అతివేగంగా ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో జాతీయ రహదారిపై మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల గుర్తింపును నిర్ధరించే ప్రక్రియ కొనసాగుతోంది. ఘటనపై కేరళ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అది విద్యా వ్యవస్థా లేక కార్పొరేట్ దోపిడీ వ్యవస్థా?

- **ప్రైవేట్ స్కూళ్లు విచ్చలవిడిగా దోచుకుంటున్నాయని కవిత ఆగ్రహం**
- **స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని మండిపాటు**
- **విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా రేవంత్ మౌనం వహిస్తున్నారన్న కవిత**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఫీజుల దోపిడీపై కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల కట్టడికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ ఫీ రెగ్యులేటరీ కమిషన్‌ను తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని, దానికి సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు రెండేళ్లుగా కేబినెట్ దాటి బయటకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. స్వయంగా విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి... పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. ప్రభుత్వ భూముల్లో నడిచే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సైతం ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచినా సర్కార్ మౌనంగా ఉండటం కార్పొరేట్ విద్యావ్యాపారులకు బాసటగా నిలవడమేనని కవిత ఆరోపించారు. 1994 నాటి జీవో ప్రకారం వార్షిక ఫీజుల పెంపు 5 శాతానికి మించకూడదన్న స్పష్టమైన నిబంధన ఉన్నా దానిని పక్కనబెట్టి, విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. రాబోయే శాసనసభ సమావేశాల్లోనే తక్షణమే పాఠశాల ఫీజుల నియంత్రణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# రెండేళ్లు సహకరించండి ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తా

**మొదటిపేజీ తరువాయి**




వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామని, జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించామని చెప్పారు.

**80 వేల అడ్మిషన్లు పెరిగాయి**

ప్రభుత్వ పాఠశాలల్లో గత రెండేళ్లలో 80 వేలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు పెరగడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని సీఎం అన్నారు. విద్యా రంగంలో జాతీయ స్థాయిలో 28వ స్థానంలో ఉన్న తెలంగాణ 17వ స్థానానికి చేరుకోవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉత్తమ విధానాలను అధ్యయనం చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఉపాధ్యాయులను విదేశాలకు పంపించామని తెలిపారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ పాలసీ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విధాన రూపకల్పనలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు.

**పాలిటెక్నిక్‌లో కొత్త విధానం**

మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానంలో నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రయత్నంపై ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం జరిగిందని అన్నారు.

పాలిటెక్నిక్‌లో రెండేళ్లు థియరీ, మూడో ఏడాది కార్పొరేట్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఇంటర్న్‌షిప్ సమయంలో కార్పొరేట్ సంస్థలు రూ.9 వేల వరకు స్టయిఫండ్ ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులకు విదేశాల్లో మాస్టర్స్ చదివేందుకు వీలుగా డిగ్రీ పట్టా అందించే విధంగా మార్పులు చేశామని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరే అవకాశంలో ఎలాంటి మార్పు ఉండదని సీఎం స్పష్టం చేశారు. లెక్చరర్ల సర్వీస్ రూల్స్ విషయంలోనూ ఎలాంటి నష్టం జరగదని తెలిపారు.

**నైపుణ్యాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్**

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు జ్ఞానం, కమ్యూనికేషన్‌తో కూడిన విద్య అందించి, ఆ తర్వాత నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. సాంకేతిక నైపుణ్యాలు ఉన్నవారికి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో నైపుణ్యాలు ఉన్నవారికి డిమాండ్ ఉందన్నారు.

స్కిల్స్ తర్వాత ఇన్నొవేషన్, ఎంప్లాయ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఏరోస్పేస్ రంగంలోని స్టార్టప్ సంస్థ స్కైరూట్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ఇన్నొవేషన్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు రెండేళ్లు కేంద్రీకృతంగా పనిచేయాలని కోరారు.

**రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై వెల్లడి**

30 నుంచి 35 ఏళ్లపాటు ప్రభుత్వ సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకుండా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దాదాపు రూ.8 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెండింగ్‌లో ఉన్నాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు చెల్లించామని తెలిపారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కేబినెట్ విస్తరణ
## ఎప్పుడు..? ఎవరికీ ఛాన్స్..?

**మొదటిపేజీ తరువాయి**

రెండు పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు సురేఖను తప్పించడంతో ఖాళీల సంఖ్య మూడుకు పెరిగింది. మరి ఈ మూడు మంత్రి పదవులను ఎప్పుడూ భర్తీ చేస్తారనే చర్చ తెరపైకి వచ్చింది. కేబినెట్ విస్తరణ ఇప్పట్లో ఉంటుందా..? ఆ అవకాశమే ఉండదా..? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లోనే కాకుండా తెలంగాణలో కూడా నడుస్తోంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత.. కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించే అవకాశముందట. ఇప్పటికే ఈ విషయంలో అధిష్టానం నుంచి అనుమతి తీసుకున్నట్టు కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. ముహూర్తం ఫిక్స్ చేసుకోవాల్సింది సీఎం రేవంతే. కేబినెట్ విస్తరణలో బీసీ సామాజికవర్గానికి అవకాశం దక్కడం పక్కానే. ఎందుకంటే బీసీ మంత్రి అయిన కొండా సురేఖను పదవి నుంచి తప్పించినందున... బీసీ సామాజికవర్గం నుంచి ఒకరిని కేబినెట్‌లోకి తీసుకోవడం ఖాయమే. మరి ఛాన్స్ దక్కేదెవరికి..?

ఆశావహులు అనేకమంది ఉన్నారు. బీసీ సామాజికవర్గం నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముందు వరుసలో ఉన్నారట. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పేరు కూడా పరిశీలనలో ఉందట. కేబినెట్ నుంచి తప్పించింది మహిళను కదా... ఆ ప్లేస్‌లో మహిళనే తీసుకోవాలి కదా..? అనే చర్చకు స్పేస్ ఇవ్వకుండా ముగ్గురు మహిళా నేతలకు పదవులు ఇచ్చేశారు. ఇక మిగిలిన రెండు మంత్రి పదవులను ఎలా భర్తీ చేయాలి..? రెడ్డి సామాజిక వర్గానికి ఒక పదవి ఇవ్వడం పక్కా. ఆ కోటాలో నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. పైగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఒక్క మంత్రి కూడా లేరు. దీంతో ఆ జిల్లాకు అవకాశం ఇవ్వాలనే ఈక్వేషన్ ఉందట. మరో వ్యక్తి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. చాలారోజులుగా పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు రాజగోపాల్ రెడ్డి. ఆయన్ని కేబినేట్‌లోకి తీసుకున్నాక కూడా పంథా మార్చకపోతే పరిస్థితి ఏంటనే చర్చ జరుగుతోందట. రాజగోపాల్ రెడ్డి తన పంథాలోనే కంటిన్యూ అయితే పార్టీకి నష్టం జరిగే అవకాశం లేకపోలేదనే మాటలు వినిపిస్తున్ననాయి. పైగా కోమటిరెడ్డి కుటుంబంలో ఇద్దరికి ఛాన్స్ ఇవ్వడంపై అధిష్టానం కూడా భిన్నరకాలుగా చర్చిస్తుంది.

మరో మంత్రి పదవి STల నుంచి లంబాడా సామాజికవర్గానికి ఇవ్వాలనే చర్చ కాంగ్రెస్‌లో జరుగుతోందట. లంబాడా వర్గానికి ఇచ్చేట్టు అయితే... దేవరకొండ MLA బాలు నాయక్ రేసులో ఉంటారని కాంగ్రెస్ వర్గాల సమాచారం. ఒకవేళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఇచ్చి, బాలు నాయక్‌కు కూడా మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే... ఇద్దరూ ఒకే జిల్లాకు చెందినవారు అవుతారు. దీనిని కూడా పార్టీ పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు రెడ్డి మంత్రులున్నారు. మళ్ళీ మూడో రెడ్డికి అవకాశం ఇస్తారా..? మరోవైపు బాలు నాయక్‌ను... డిప్యూటీ స్పీకర్ చేయాలనే చర్చ కూడా వచ్చిందట. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించారు కాబట్టి ఆ జిల్లాకు చెందిన లంబాడాకు అవకాశం ఇస్తారా..? అనే చర్చ కూడా నడుస్తోంది. అలాగైతే రామచంద్రు నాయక్ పేరును పరిశీలించాల్సి ఉంటుంది. ఆయనపై అధిష్టానం ఇప్పటికే సీరియస్‌గా ఉంది. డిప్యూటీ స్పీకర్‌గా అభ్యర్థిత్వం ప్రకటించినా... పదవి తీసుకోకపోవడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సీరియస్‌గా ఉన్నారట. మరి లంబాడా కోటాలో బాలు నాయక్ మంత్రి అవుతారా..? లేదంటే రామచంద్ర నాయక్‌కు అవకాశం దక్కుతుందా..? అనే చర్చ కాంగ్రెస్‌లో గట్టిగానే నడుస్తోందట. మరి సీఎం రేవంత్ రెడ్డి మనసులో ఏముంది..? ఆయన ఎవరిని ఎంపిక చేసుకుంటారు..? అనేది త్వరలో క్లారిటీ రావొచ్చంటున్నాయి గాంధీభవన్ వర్గాలు.

## వెయ్యి రోజుల పాలనలో
## వెయ్యి అబద్ధాలు

**మొదటిపేజీ తరువాయి**



భాగంగా శనివారం దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సీపూర్ క్రాసింగ్ వద్ద నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**మళ్లీ రోడ్లపైకి రావాల్సి వచ్చింది**

తెలంగాణ కోసం గతంలో ఉద్యమం చేసిన తాము.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన కారణంగా నేడు మళ్లీ రోడ్లపైకి రావాల్సి వస్తోందని హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా కాస్తా ఐదారు గంటలకు పడిపోయిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోసం రైతులు ఎదురుచూసే పరిస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు.

**ఉచిత కరెంట్‌పై ఎద్దేవా**

కాంగ్రెస్ చెప్పిన పాత రోజులు మళ్లీ వచ్చాయని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్‌గా మారిందంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**రైతుబంధు నిలిపివేశారని ఆరోపణ**

కరోనా సమయంలోనూ రైతుబంధు పథకం ఆగలేదని హరీశ్‌రావు గుర్తు చేశారు. రైతులపై కేసీఆర్‌కు ప్రేమ ఉండేదని.. సీఎం రేవంత్‌రెడ్డికి ఏమైందని ప్రశ్నించారు. ఉన్న రైతుబంధు పథకానికి ఎసరు పెట్టారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్లలో రూ.29 వేల కోట్ల రైతుబంధు నిధులను ఎగ్గొట్టిందని పేర్కొన్నారు.

**రైతు బీమా, ఎరువులపై విమర్శలు**

రైతు బీమాను బంద్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. యాప్‌లో బుక్ చేసినా 15 రోజుల వరకు డీఏపీ ఇవ్వడం లేదన్నారు. షాపులో లేని యూరియా యాప్‌లోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు. యూరియా ధరలను బీజేపీ ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రైతుల ఉసురు పోసుకుంటున్నాయని మండిపడ్డారు.

**కాళేశ్వరంపై తీవ్ర ఆరోపణలు**

ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఈ మూడేళ్లలో ఒక్క ఎకరా భూసేకరణ చేయలేదని, జానెడు కాలువ కూడా తవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మేడిగడ్డ వద్ద చిన్న మరమ్మతు చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చారని విమర్శించారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. రేవంత్‌రెడ్డి తెచ్చిన కరవు అని వ్యాఖ్యానించారు.

**కేసీఆర్ అధికారంలోకి రావాలన్న హరీశ్‌రావు**

మేడిగడ్డ వద్ద 44 వేల క్యూసెక్కుల నీరు పారుతోందని హరీశ్‌రావు తెలిపారు. మోటార్లు ఆన్ చేస్తే మల్లన్నసాగర్‌కు నీరు వస్తుందని చెప్పారు. వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు, వెయ్యి ఓట్లు, భూ కబ్జాలు తప్ప మరేమీ లేవని ఆరోపించారు. రైతుబంధు గతంలో మాదిరిగా రావాలంటే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కేసీఆర్ రాజీనామా చేయాలి

- **ప్రజలకు అందబాటులో లేనప్పుడు ఎమ్మెల్యేగా కొనసాగడం ఎందుకు?**
- **ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించడం లేదని మంత్రి విమర్శ**
- **కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో 6న ఇందిరాపార్క్‌లో మహా ధర్నా**
- **మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు**
- **హైదరాబాద్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపణ**
- **పదేళ్లలో వందేళ్ల విధ్వంసం జరిగిందని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్య**
- **ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ అసెంబ్లీకి హాజరుకావడం లేదని విమర్శ**
- **నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరని మంత్రి ఆరోపణ**
- **కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామన్న పొన్నం**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాప్రతినిధి తన బాధ్యతలను నిర్వర్తించనప్పుడు ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**సన్నాహక సమావేశంలో మంత్రుల ప్రసంగం**

మహా ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు మాట్లాడారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా తన బాధ్యతలను నిర్వర్తించడం లేదని పొన్నం విమర్శించారు.

**అసెంబ్లీకి హాజరుకావడం లేదని ఆరోపణ**

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగిందని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పదేళ్ల పాలనలో 100 ఏళ్ల విధ్వంసం జరిగిందని విమర్శించారు. వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడం లేదని అన్నారు.

**ప్రజలకు అందుబాటులో లేరని విమర్శ**

తన నియోజకవర్గ ప్రజలకు కూడా కేసీఆర్ అందుబాటులో లేకుండా వ్యవహరిస్తున్నారని పొన్నం ఆరోపించారు. ప్రతిపక్ష నేత పాత్రను కూడా నిర్వర్తించడం లేదని విమర్శించారు. ఈ అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకే మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కాంగ్రెస్ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరిస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహా ధర్నా ద్వారా కేసీఆర్ వ్యవహారశైలిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించనున్నట్లు చెప్పారు.

## 22ఏ జాబితా నుంచి ప్రజల ఇళ్లను తొలగించాలి

- **సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీపై ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం**
- **1500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై ప్రజల ఆవేదన**
- **ప్రభుత్వ అనుమతులతోనే కాలనీ నిర్మాణం జరిగిందన్న ఎంపీ**
- **55 ఎకరాల్లో సింఫనీ హోమ్స్ నిర్మించారని వెల్లడి**
- **12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీని ఎలా చేర్చారన్న ప్రశ్న**
- **రుణాలు తీసుకుని కట్టుకున్న ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై ఆగ్రహం**
- **రేవంత్‌రెడ్డి ఇల్లు 22ఏ జాబితా నుంచి ఎలా తొలగించారని నిలదీత**
- **ప్రజల ఆస్తులనూ అదే తరహాలో తొలగించాలని డిమాండ్**
- **అధికారుల తప్పులకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్న ఎంపీ**
- **బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రఘునందన్‌రావు డిమాండ్**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ నిషేధిత జాబితా అంశంపై నిర్వహించిన సమావేశంలో *మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రజలకు అండగా పోరాడతామని హామీ ఇచ్చారు.* కాలనీలోని సుమారు 1,500 ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల అనుమతులతో నిర్మించిన ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు.

**ప్రభుత్వ అనుమతులతో నిర్మాణం**

పటాన్‌చెరులో 55 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ శాఖల అనుమతులతోనే సింఫనీ హోమ్స్ నిర్మాణం జరిగిందని రఘునందన్‌రావు తెలిపారు. ఇలాంటి కాలనీని నిషేధిత జాబితాలో చేర్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

**రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారు**

రూపాయి రూపాయి కూడబెట్టి, రుణాలు తీసుకుని ఇళ్లను నిర్మించుకున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఇళ్లను రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం బాధాకరమని ఎంపీ పేర్కొన్నారు.

**12 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీ**

సుమారు 12 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయిన కాలనీని ఇప్పుడు 22ఏ జాబితాలో ఎలా చేర్చారని రఘునందన్‌రావు ప్రశ్నించారు. కాలనీ నిర్మాణ సమయంలో ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

**రేవంత్‌రెడ్డి ఇంటిపై ప్రశ్న**

ఎవరు దరఖాస్తు చేశారని రేవంత్‌రెడ్డి ఇల్లు 22ఏ జాబితా నుంచి తొలగించారని ఎంపీ ప్రశ్నించారు. అదే తరహాలో నిషేధిత జాబితాలో ఉన్న ప్రజల ఆస్తులను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు.

**తప్పును సరిదిద్దాలి**

తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణ చెప్పడంతో సమస్య పరిష్కారం కాదని రఘునందన్‌రావు అన్నారు. జరిగిన తప్పును ప్రభుత్వం సరిదిద్దాలని సూచించారు. 22ఏ జాబితాలో ప్రజల ఆస్తులను చేర్చడంపై సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

22ఏ జాబితాలో తప్పులకు బాధ్యులైన అధికారులను ప్రభుత్వం శిక్షించాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. కాలనీ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

# 22ఏ భూములపై 30 శాతం కమీషన్

మొదటిపేజీ తరువాయి

డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు**

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూదొందేనని రామచందర్‌రావు ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం దోచుకుందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి బ్రదర్స్ దోచుకుంటున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని అన్నారు. తెలంగాణలో భవిష్యత్తులో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. మహా ధర్నాలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో పెరుగనున్న ఆటో చార్జీలు

హైదరాబాద్ సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం): తెలంగాణ రాష్ట్రంలో ఆటోఛార్జీలను పెంచా లని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రతిపాదిత రేట్ల ప్రకారం మొదటి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గానూ, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 గానూ నిర్ణయించిం ది. అలాగే నిమిషాని కి 75 పైసల వెయి టింగ్ ఛార్జీ, రాత్రివేళ ప్రయాణానికి సాధారణ ఛార్జీపై 50 శాతం అదనపు ఛార్జీ సర్ ఛార్జ్ ని విధించా లని కమిటీ సూచించింది.

ఈ సిఫార్సులతో కూడిన నివేదికను రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి ఇటీవల ప్రభుత్వానికి సమ ర్పించారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన తర్వాత ఛార్జీల పెంపునకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ కానున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధా రిత యూనియన్ల జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ 14 డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 7 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపు నిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆగస్టు 23న జరిగిన సమావేశంలో 15 రోజుల్లోగా ప్రతిపా దనలు సమర్పిస్తా మని అధికారులు హామీ ఇవ్వడంతో వారు సమ్మె పిలుపును ఉపసంహరిం చుకున్నారు.

ఈ నేపథ్యంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్‌రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐలతో కూడిన బృందం తమ నివే దికను సమర్పించే ముందు కేరళ, ఢిల్లీ, కర్ణాటక బెంగళూరు, మహారాష్ట్ర ముంబ యి ల్లోని ఆటో ఛార్జీల విధానాలను అధ్యయనం చేసింది.

**12 ఏళ్లుగా ఛార్జీలు పెంచలేదు**

ఇంధన ధరలు, బీమా, ఇతర నిర్వహణ ఖర్చుల వంటి వ్యయాల ఆధారంగానే ఛార్జీల పెంపు సిఫార్సు చేసినట్లు నివేదికలో కమిటీ పేర్కొంది. వాహన ధర రూ.2.55 లక్షలు, బ్యాంక్ రుణ సదుపాయం 70 శాతం, డ్రైవర్ నెలవారీ జీతం రూ.25 వేలు సగటు న రోజువారీ ప్రయాణ దూరం 163.8 కి.మీ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఆదాయాన్ని ఆర్జించే ప్రతి కిలోమీటర్‌కు నిర్వహణ వ్యయం రూ.13.53గా ఉంది. దీనివల్ల కిలోమీటర్ కు రూ.14 ఛార్జీని సిఫార్సు చేశారు. గత 12 ఏళ్లుగా ఆటో ఛార్జీలలో ఎలాంటి మార్పు లేదని, ఇప్పుడు వాటిని పెంచాల్సిన అవసరం ఉందని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది.

# ముత్యాలమ్మ తల్లి బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- **దివ్యాంగుల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొబ్బల రవీందర్ రెడ్డి**



చౌటుప్పల్, సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం): చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రోజు ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకోవాలని బొబ్బల రవీందర్ రెడ్డి భక్తులకు సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేందుకు భక్తులు, యువత, నిర్వాహకులు పరస్పరం సహకరించాలని బొబ్బల రవీందర్ రెడ్డి కోరారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆయన ప్రార్థించారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సరస్వతి

- **ఆదర్శ మోడల్ స్కూల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**
- **విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు: ప్రిన్సిపల్ శివస్వరూప రాణి**



చౌటుప్పల్, సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం) చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లక్కారం ఆదర్శ మోడల్ స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శివస్వరూప రాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ మోడల్ స్కూల్ లక్కారంలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న సరస్వతి మేడంకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ, వారి ప్రతిభను వెలికితీసి, విద్యా ప్రగతికి చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డు అందుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివస్వరూప రాణి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు.

ఆదర్శ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లోనూ ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న సరస్వతి మేడంను ప్రిన్సిపల్ శివస్వరూప రాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఆమె సాధించిన ఈ ఘనత పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

# విద్యార్థులను ఫోన్‌కు దూరంగా ఉంచాలి.. క్రీడలపై ఆసక్తి పెంచాలి

మొదటిపేజీ తరువాయి

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన వారితో మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్రపై ఆయన మాట్లాడారు.

**దైనందిన జీవితంపైనా శ్రద్ధ**

విద్యార్థుల చదువు విషయంలో మాత్రమే కాకుండా వారి దైనందిన జీవితంపైనా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని మోదీ సూచించారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో పిల్లలను సరైన మార్గంలో నడిపించడంలో టీచర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థులు ఎలాంటి అలవాట్లకు లోనవుతున్నారు.. ఏం చేస్తున్నారు అనే విషయాలను నిరంతరం గమనించాలని చెప్పారు.

**మాదకద్రవ్యాలపై అప్రమత్తత**

మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావించిన ప్రధాని.. పిల్లలు చెడు అలవాట్లకు గురికాకుండా ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను గుర్తించి వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని చెప్పారు.

**ఫోన్‌కు దూరంగా.. క్రీడలకు దగ్గరగా**

విద్యార్థులు స్క్రీన్‌ను చూసే సమయాన్ని తగ్గించడం ప్రస్తుతం ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. క్రీడలు, సృజనాత్మక ఆవిష్కరణలపై పిల్లల్లో ఆసక్తిని పెంచడం ద్వారా వారిని ఫోన్‌కు దూరంగా ఉంచవచ్చన్నారు. అదే సమయంలో నూతన సాంకేతికతలపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

**ప్రతిభను గుర్తించాలి**

బోధన ద్వారా విద్యార్థుల్లో అనేక మార్పులు తీసుకురావచ్చని ప్రధాని అన్నారు. పిల్లలు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రతిభ ఉంటుందని.. దాన్ని టీచర్లు గుర్తించి ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని పేర్కొన్నారు.

**తరగతి గదికే పరిమితం చేయొద్దు**



విద్యార్థులను కేవలం తరగతి గదికే పరిమితం చేయకూడదని మోదీ సూచించారు. వారిని బయటకు తీసుకువెళ్లి నిజ జీవిత నైపుణ్యాలు, సమాజ పరిస్థితులపై అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలను కూడా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు.

**82 మందికి జాతీయ పురస్కారాలు**

ఈ ఏడాది 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ నుంచి 48 మంది, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21 మంది అధ్యాపకులు ఉన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత విభాగం నుంచి మరో 13 మంది నైపుణ్య శిక్షకులు పురస్కారాలకు ఎంపికయ్యారు. పురస్కార గ్రహీతలు తమ బోధనా పద్ధతులు, అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

# మోసపూరిత పాలన విద్యార్థి, నిరుద్యోగ గర్జన!

- **బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి.**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.**
- **విద్యార్థినులకు స్కూటీల హామీ ఏమైంది:సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి**








శంకర్ పల్లి సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ శంకర్ పల్లి మండల భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మరియు నిరుద్యోగులతో పాటు కలిసి సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భారీ ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు.

శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ....రాష్ట్రంలో సుమారు ₹12,000 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ బి.ఆర్.ఎస్. పార్టీ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.... జీవో నంబర్ 97 రద్దు పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని శంకర్ పల్లి మండల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు.

**నిరుద్యోగ సమస్యలు & జాబ్ క్యాలెండర్**

కాంగ్రెస్ తన 'యువ డిక్లరేషన్' లో ప్రకటించిన విధంగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి మరియు ఒక స్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**నిరుద్యోగ యువత మాట్లాడుతూ కొత్త నోటిఫికేషన్లు**

పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న సుమారు 19,000 పోస్టులతో పాటు గ్రూప్ I, II, III, IV మరియు మెగా డీఎస్సీ నోటిఫికేషన్లను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మండల మాజీ ఎంపీపీలు గోవర్ధన్ రెడ్డి, నర్సింలు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వాసుదేవ్ కన్నా, మాజీ మార్కెట్ కమిటి చేర్మేన్ మాణిక్ రెడ్డి, సర్పంచ్ లు రాఘవేందర్ రెడ్డి, ఇంద్రాసేనా రెడ్డి, ఎరుకల శేకర్, కౌన్సిలర్ లు విజయ్ కుమార్, మహేందర్ రెడ్డి, ప్రశాంత్, మాజీ కౌన్సిలర్ లు శ్రీనాథ్ గౌడ్, మాజి సర్పంచ్ లు శ్రీధర్, నర్సింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బద్దం సురేందర్ రెడ్డి, అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టి సినియర్ నాయకులు, యుత్ నాయకులు, మైనారిటీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# 22ఏ భూ సమస్యల పై భాజపా ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా

- **- ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ భాజపా ప్రతినిధులు**






మేడ్చల్ సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం): తెలంగాణ రాష్ట్రంలోని రైతులు, అమాయకుల భూములను రాష్ట్ర ప్రభుత్వం 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చి వివాదాస్పద నిర్ణయం తీసుకోవడం హేయమైన చర్య అని ఇట్టి నిబంధన వెంటనే రద్దు చేయాలనే డిమాండ్ తో తెలంగాణ రాష్ట్ర భాజపా ఆధ్వర్యంలో శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన దీక్షకు డివిజన్ అధ్యక్షులు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నుంచి భారీగా తరలివెళ్లి దీక్షలో పాల్గొన్నారు. 22ఏ ల్యాండ్ ఇష్యూ అమాయక ప్రజలతో ఆటలాడుతోందని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా భాజపా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ జగన్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మెడలు వంచే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అమాయక ప్రజల భూములతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలని 22 ఏ చట్టం చెబితే..ఈ ప్రభుత్వం మాత్రం రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ దీక్షా కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ అమరం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీజేవైఎం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాగం అర్జున్, మేడ్చల్ డివిజన్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఎల్లంపేట్ మున్సిపల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ మురళిధర్ గుప్తా నాయకులు మహేష్ సత్యనారాయణ రెడ్డి, జాకట బాబురావు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# గురువే భావితరాలకు మార్గదర్శి

- **ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**
- **జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



షాబాద్ సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం): విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చే గురువుల సేవలు చిరస్మరణీయమని పీ ఆర్ టీ యూ షాబాద్ మండల అధ్యక్షులు డేవిడ్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి బీరపోల్ల కృష్ణయ్య అన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఈరోజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి మేడం, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు షాబాద్ మండలం నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన అంబర్ సింగ్ ఉన్నత పాఠశాల మన్మర్రి, లలిత ఉన్నత పాఠశాల తాళ్లపల్లి, సుజాత మోడల్ స్కూల్, కృష్ణయ్య ప్రాథమిక పాఠశాల నాగర్ గూడ, మాధవరెడ్డి ప్రాథమిక పాఠశాల కేశవగూడ ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "గురువు విద్యార్థికి కేవలం విద్యను మాత్రమే అందించడు, విద్యతోపాటు విజ్ఞానం క్రమశిక్షణ, నైతిక విలువలు, మానవతా దృక్పథాన్ని నేర్పి,మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాడు" అని అన్నారు.ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. "ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు... ఒక తరం భవిష్యత్తును మార్చగలడు" అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పీ ఆర్ టీ యూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ నరసింహులు, మహిళ ఉపాధ్యక్షురాలు సుశీలక్క, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బి అంజయ్య, కార్యదర్శి ప్రవీణ్ కుమార్ బి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, జిల్లా బాధ్యులు జయరాజు, దశరథ రెడ్డి,బాలరాజు, మర్పల్లి అశోక్, జైపాల్ రెడ్డి, యాదయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు డేవిడ్ రెడ్డి, కృష్ణయ్య, గౌరవ అధ్యక్షులు అంజయ్య, కాజా పాషా, సింహాద్రి రాజేంద్ర నాయుడు, రాజేంద్రప్రసాద్, జగన్, కవిత, లక్ష్మి, జయమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ విమర్శలు అర్థరహితం.

- **మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి**



శంకర్ పల్లి సెప్టెంబర్ 05(ప్రజా-క్షేత్రం): కాంగ్రెస్ ప్రభుత్వం దగా ప్రభుత్వం అంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం-అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన వారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. శంకర్‌పల్లి మండలంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి సహకారం తో ఎమ్మెల్యే యాదయ్య అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరిది మాటల ప్రభుత్వం, ఎవరిది చేతల ప్రభుత్వమో ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి పనిచేస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజల అభివృద్ధే మా సమాధానం అని బొల్లారం వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# బూనేడు గ్రామంలో ఇండ్ల మధ్యన ప్రవహిస్తున్న మురుగునీరు

**కొత్తపల్లి సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం):** కొత్తపల్లి మండలంలోని బునేడు గ్రామంలో వార్డు నెంబర్ ఎనిమిదిలో ఇండ్ల మధ్యన డ్రైనేజీ నిర్మించకపోవడం మురుగునీరు ప్రవహించడం వల్ల వార్డులోని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని తెలిపారు.



# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ సమర భేరీ

- **పట్నం అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌గూడ నుంచి షాబాద్ వరకు భారీ బైక్ ర్యాలీ**
- **కాంగ్రెస్ హామీల అమలుకు బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్.**
- **ముఖ్య అతిథులు..సబితా ఇంద్రారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు.**

**షాబాద్, సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం):** అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాగర్‌గూడ నుంచి షాబాద్ మండల కేంద్రం వరకు సాగిన ఈ ర్యాలీ సుమారు నాలుగు గంటలపాటు కొనసాగింది. పట్నం అవినాష్‌రెడ్డి నాయకత్వంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బైక్‌లపై తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ఎన్నికల హామీల అమలుపై విమర్శలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా యువత, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, హామీల అమలులో జాప్యం చేస్తే మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని తెలిపారు. అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగర్‌గూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ వివిధ గ్రామాల మీదుగా షాబాద్ మండల కేంద్రానికి చేరుకుంది. నాలుగు గంటలపాటు సాగిన ర్యాలీలో బీఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొనడంతో షాబాద్ మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. కార్యక్రమంలో శంభీపూర్ రాజు, విజయ్ ఆర్య, పీఏసీఎస్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులు, నర్సింలు, పాలమాకుల మల్లయ్య, మద్దూరు పాండు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీతారామ కెనాల్ బ్రిడ్జిపై రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదం!

- **ఎన్నిసార్లు వార్తలు ప్రచురించినా స్పందించని అధికారులు**
- **ఎంతమంది గాయపడినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులు**
- **ఇకనైనా కళ్లు తెరిచి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్**





**బూర్గంపాడు, సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం):** బూర్గంపాడు మండల పరిధిలోని సీతారామ కెనాల్ బ్రిడ్జి ప్రజలకు రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న రహదారి, బయటకు కనిపిస్తున్న ఇనుప చువ్వలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు,చిన్న వాహనదారులు బ్రిడ్జిపై ప్రయాణించేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు.బ్రిడ్జి దుస్థితిపై మనజ్యోతి పత్రికలో పలుమార్లు వార్తలు ప్రచురించినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బ్రిడ్జి పరిస్థితి రోజురోజుకూ మరింత అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికే ఈ బ్రిడ్జిపై పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలైన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో గుంతల్లో నీరు చేరడంతో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.రాత్రి వేళల్లో గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే వరకు అధికారులు ఎందుకు వేచి చూస్తున్నారు? అని స్థానికులు నిలదీస్తున్నారు.చిన్నపాటి మరమ్మతులతో పరిష్కరించగల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమని స్థానికులు పేర్కొంటున్నారు.ఎన్నిసార్లు వార్తలు రాస్తే అధికారులు స్పందిస్తారు? ఎంతమంది గాయపడితే చర్యలు తీసుకుంటారు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీతారామ కెనాల్ బ్రిడ్జిని తక్షణమే పరిశీలించి, గుంతలను పూడ్చడంతో పాటు దెబ్బతిన్న భాగాలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, ముందుగానే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# తాండూరులో విద్యార్థులు, యువత నిరసన

- **హామీల మాయలో మోసం.. కాంగ్రెస్‌పై యువత గళం!**
- **420 హామీలు.. 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను విస్మరించారు**
- **తాండూరులో విద్యార్థులు, యువత నిరసన.. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి**

తాండూరు, సెప్టెంబర్ 05(ప్రజాక్షేత్రం):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ తాండూరులో విద్యార్థులు, యువత నిరసనకు దిగారు. శనివారం తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్‌లో విద్యార్థులు, యువత ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. 420 హామీలు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు నేడు మోసపోయామని ఆవేదన చెందుతున్నారని అన్నారు.ప్రత్యేకంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు అవకాశాలు, విద్యారంగ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయని, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రోహిత్ రెడ్డి ఆరోపించారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# గురువుల రుణం తీర్చుకోలేనిది

- **కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య**

**మొయినాబాద్, సెప్టెంబర్ 05 (ప్రజా క్షేత్రం):** విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుతూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గొడుగు యాదయ్య అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ...విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన గడ్డమీది బాలరాజు

**జగద్గిరిగుట్ట,సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):** మేడ్చల్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డమీది బాలరాజు ఎంపికయ్యారు. ఉపాధ్యాయదినోత్సవ సందర్భంగా శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనను జిల్లా కలెక్టర్ సత్కరిస్తారు. 1999లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని బౌరంపేట ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటర్ గా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ లో ఎంఎస్సి బోటనీ, బిఎడ్ పూర్తి చేశారు. కూకట్ పల్లి లో ఓ ప్రయివేట్ కాలేజీ లో బోటనీ లెక్చరర్ గా పనిచేశారు. అనంతరం బడుగు, బలహీన వర్గాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందించాలన్న లక్ష్యంతో జగద్గిరిగుట్ట రాజీవ్ గృహ కల్ప, కూన మహాలక్ష్మి నగర్ ప్రాంతం లో సంస్కృతి పాఠశాలను నెలకొల్పాడు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం అధికంగా ఉండే ఈ ప్రాంతంలో వారి పిల్లలకు తక్కువ ఫీజులకే విద్యను అందిస్తున్నాడు. అదే ప్రాంతం లో పలువురు నిరుద్యోగులకు ఉపాధిని కలిపించి ఆదర్శంగా నిలిచాడు. పాఠశాల ద్వారా పిల్లలకు విద్యను అందించడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. అంగన్వాడీ పిల్లలకు ఎప్పటికి అప్పుడు చేయూతనిస్తూ కుర్చీలను, వంట సామాగ్రిని అందజేసే కార్యక్రమం చేపట్టారు. సామాజిక బాధ్యతగా రాజీవ్ గృహకల్ప, కూన మహాలక్ష్మి నగర్ లలో ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తన సేవా దృక్పధం చాటుకుంటున్నారు. ఈ క్రమంలో 2026 జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం తో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల పిల్లలకు ఉత్తమ విద్యను అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



# ఆలయ భూముల అక్రమ విక్రయాలను అడ్డుకోవాలి

**మహేశ్వరం, సెప్టెంబరు 5 (ప్రజాక్షేత్రం):** బాలాపూర్ మండలం మామిడిపల్లిలోని ప్రాచీన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూముల అక్రమ విక్రయాలు, కబ్జా యత్నాలను భాజపా నాయకుడు పేరామని నరేష్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. సర్వే నంబర్లు 50, 52, 53, 54, 65, 66, 67లో ఉన్న 33.12 ఎకరాల ఇనాం భూములతో పాటు సర్వే నంబరు 51లోని 2.16 ఎకరాల భూములు ఆలయానికి చెందినవని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.500 కోట్లు ఉంటుందని, కొందరు అక్రమార్కులు వాటిని విక్రయించేందుకు బేరసారాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. ఆలయ భూములు దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఎవరూ ఈ భూములను కొనుగోలు చేసి మోసపోవద్దని నరేష్ యాదవ్ హెచ్చరించారు. దేవుడి భూముల జోలికి వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. భూములను కొనుగోలు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. భక్తులు, గ్రామస్థులతో కలిసి ఆలయ భూముల పరిరక్షణకు పోరాడతామని తెలిపారు.



# జింకలగూడెంలో ఉచిత వైద్య శిబిరం

- **జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు వైద్య సేవలు**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మోరంపల్లి బంజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామం జింకలగూడెంలో ఇటీవల జ్వరాల తీవ్రత పెరగడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు.గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి బొర్రా సుభద్ర ప్రత్యేక చొరవ తీసుకున్నారు.ఈ మేరకు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి నగేష్‌ను సంప్రదించి గ్రామంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు.జింకలగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించారు.జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు.గ్రామంలో జ్వరాల తీవ్రతను గుర్తించి వెంటనే స్పందించి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు సర్పంచ్ బొర్రా సుభద్రకు, వైద్యాధికారి నగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు నిరంతరం కొనసాగించాలని గ్రామస్తులు కోరారు.




# సమానత్వ సాధనే ఎమ్మార్పీఎస్ ఆశయం

**మహేశ్వరం, సెప్టెంబరు 5 (ప్రజాక్షేత్రం):** సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం నిబద్ధతతో ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.

మహేశ్వరం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల మండల కమిటీ సమావేశం మండల ఇన్‌చార్జి ఎర్ర గణేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ.. అనేక కుల ఉద్యమాలు లక్ష్యం సాధించే వరకు కొనసాగలేకపోయాయని, ఎమ్మార్పీఎస్ మాత్రం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘ ఉద్యమాన్ని కొనసాగించి విజయం సాధించిందన్నారు. పాలకులు, రాజకీయ పక్షాలు పట్టించుకోని ప్రజా సమస్యలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ఉద్యమాల ద్వారా అనేక సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉందన్నారు.

మాదిగల సమస్యలతో పాటు అన్ని వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేదరికం, కుల వివక్ష, దోపిడీ, పీడన లేని సమాజ నిర్మాణం కోసం మహనీయుల మార్గంలో ఉద్యమిస్తామని తెలిపారు.

నూతన కమిటీలు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బోల్లెపాక ప్రభాకర్ మాదిగ, అధికార ప్రతినిధిగా కొండని కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల శ్రీనివాస్ మాదిగ, ఉపాధ్యక్షులుగా మంద మహేష్, భూషన్నగారి శేఖర్, పి.వంశీ, కోశాధికారిగా శంకరయ్య, కార్యదర్శిగా పి.మల్లేష్‌లను ఎన్నుకున్నారు.

ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ఆదిరాల స్వామి, అధికార ప్రతినిధిగా పోరండ్ల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మంద నరసింహ, ఉపాధ్యక్షులుగా మహేశ్వరం రాజేష్, కిన్నరి రాజు, కార్యదర్శిగా మోడీ శేఖర్ ఎంపికయ్యారు. మాదిగ యువసేన మండల అధ్యక్షుడిగా ఎర్ర జగన్, అధికార ప్రతినిధిగా రావుగళ్ల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు రావుగల్ల బాబు మాదిగ, పెంటనోళ్ల నరసింహ మాదిగ, ఎర్ర కృష్ణ మాదిగ, సీనియర్ నాయకులు బక్కని రవి మాదిగ, డాక్టర్ జంగయ్య మాదిగ, అర్జున్, నవీన్‌తో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**శంషాబాద్ సెప్టెంబర్ 05(ప్రజా క్షేత్రం):** శంషాబాద్ మండల పరిధిలోని పిల్లోని గూడ గ్రామంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషోర్, ఉపాధ్యాయురాలు సరిత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జుర్కి రమేష్ పటేల్, ఉప సర్పంచ్ పిల్లి శ్రీశైలం, సుధాకర్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే రేపటి భారత నిర్మాతలు





- **శ్రీ సరస్వతీ శిశు మందిర్‌కు రూ.5 లక్షల భారీ విరాళం,**
- **ఆర్బిఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి,**

**తాండూర్, సెప్టెంబర్ 5 (ప్రజాక్షేత్రం )**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు ఆర్బిఎల్ సీఈఓ బియ్యని శ్రీనివాస్ రెడ్డి రూ.5 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. శనివారం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును ఆయన అందించారు.

ఈ సందర్భంగా బియ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "విద్యార్థులే రేపటి భవిష్యత్ భారత నిర్మాతలు" అని అన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను విద్యార్థుల్లో పెంపొందించడంలో సరస్వతీ విద్యాపీఠం, శిశు మందిర్ పాఠశాలలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులను సామాజిక స్పృహ, దేశభక్తి కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న సంస్థకు తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు డా. మల్లేశం, శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు కటకం వీరేందర్, యాజమాన్య కమిటీ సభ్యులు పెరుమాళ్ల రాంరెడ్డి, అనంతరెడ్డి, జి. నరేందర్, కౌన్సిలర్లు జుంటుపల్లి వెంకట్, ఎం. రామకృష్ణ, ఎన్. రాజుగౌడ్, విద్యావేత్త పర్యాద రామకృష్ణ, భీంశెట్టి మధుసూదన్, సుబ్బారావు, ప్రభుశంకర్, మాజీ కౌన్సిలర్ జుబేర్ లాల్, జోషి వికాస్, ప్రహ్లాద్, సమద్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..



## రచ్చ గల్లి ఎంపీపీ ఎస్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- **పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ ను సన్మానించిన పూర్వ విద్యార్థులు**
- **బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్యామల కులకర్ణి ఆధ్వర్యంలో సన్మానం**

**కోటగిరి, సెప్టెంబర్ 05 (ప్రజాక్షేత్రం)**

కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్ పాల్గొని ఉపాధ్యాయులకు శాలువా పూలమాలతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కే.కృష్ణమోహన్ ను ఇటీవల జిల్లా పిఆర్టియు ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనందున పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా గురుభక్తిని చాటుకుంటూ ఆయనకు పాదాభివందనం చేసి,శాలువాతో సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇటీవల పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారూ. పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్ చందర్ మాట్లాడుతూ ... ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని సర్పంచ్ బర్ల మధుకర్ శాల్వతో సన్మానం శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు అలాగే పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ .ఉపాధ్యాయ దినోత్సవ వేళ మా గురువుగారిని సత్కరించుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఉపాధ్యాయ వృత్తిలో మా గురువు సేవలు మరువలేనివని. పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులు కావడం మాకెంతో గర్వకారణమని అన్నారు.భవిష్యత్తులో మా గురువు కే.కృష్ణమోహన్ సర్ మంచి పదవులు చేపట్టి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతేవాలని మనసారా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పత్తి.సతీష్, ఏముల.నవీన్,ఆలపాటి హరికృష్ణ,నీరడి.భూమయ్య,కప్ప.సాయిలు,వై.అనిల్,రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్ కులకర్ణి, సీనియర్ నాయకురాలు శ్యామల కులకర్ణి,సీనియర్ నాయకులు మార్కెల్లి ప్రకాష్ పటేల్,పిఆర్టియు కోటగిరి మండల ప్రధాన కార్యదర్శి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీ.ఉదయ్ చందర్,ఉపాధ్యాయ బృందం,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలోనే సంక్షేమ , అభివృద్ధి ఫలాలు

- **భానూరి శివ శంకర్ గౌడ్**

**మొయినాబాద్, సెప్టెంబర్ 05(ప్రజా క్షేత్రం):**

సన్నబియ్యం, ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పెంపు, పింఛన్లు, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాలతో అప్పుల రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి వైపు నడిపిస్తోందని చేవెళ్ల నియోజకవర్గ (టీపీసీసీ ఐఎన్‌టీయూసీ) లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివ శంకర్ గౌడ్ తెలిపారు. ఈ ప్రజాపాలనను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు, డబల్ బెడ్రూమ్ ఇండ్లు




ఇవ్వకుండా రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన వారి మోసాలను ప్రజలు నమ్మవద్దని, వారికి త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

## ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో కాంగ్రెస్ మహా ధర్నా!

- **మహా ధర్నా విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణుల సన్నాహాలు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం**
- **సమావేశంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్**

**హైదరాబాద్.సెప్టెంబర్ 5,(ప్రజా క్షేత్రం):**

ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో మహా ధర్నా ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మహా ధర్నాకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం, పెద్ద సంఖ్యలో ప్రజలు మరియు కాంగ్రెస్ శ్రేణులను తరలించే అంశాలపై ముఖ్య నాయకులు చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ సమావేశంలో పాల్గొని మహా ధర్నా ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మహా ధర్నాలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.







## అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

- **మాల సంగం బాన్సువాడ నియోజకవర్గ అధ్యక్షులు మిర్జాపూర్ చిన్న సాయన్న**
- **అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలకు కోటగిరిలో మాల సంఘం ఆధ్వర్యంలో నిరసన**

**కోటగిరి సెప్టెంబర్ 05 (ప్రజాక్షేత్రం):**

వారంరోజుల క్రితం భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ ను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల సంఘం ఆధ్వర్యంలో నిరసనగా ధర్నా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మాల సంఘం నాయకులంతా కలిసి ఖబడ్దార్ ఖబర్దార్ హమారా ప్రసాద్ ఖబర్దార్ అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గం మాల సంఘం అధ్యక్షులు మీర్జాపూర్ చిన్న సాయన్న, కొత్తపల్లి అంబేద్కర్ సంఘ నాయకులు పూప్పల మారుతి మీడియాతో మాట్లాడుతూ.... వారం రోజుల క్రితం భారతరత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగమే రాయలేదని అనటం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. మనువాదులకు బానిసైన హమారా ప్రసాద్ రాస్తున్న పుస్తకాలను విడుదల చేయకుండా నిలిపివేయాలని వారు పేర్కొన్నారు. ఒకవేళ హమారా ప్రసాద్ రాస్తున్న పుస్తకాన్ని విడుదలైనచో భారతదేశంలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షులు మీర్జాపూర్ చిన్న సాయన్న, కొత్తపల్లి అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు పుప్పల మారుతి, కోటగిరి అంబేద్కర్ సంఘం అధ్యక్షులు బి. రాములు, బాన్సువాడ నియోజకవర్గ మాల సంఘం ప్రధాన కార్యదర్శి పుప్పల సైదయ్య, పాల గంగారం, జీవన్,గజానంద్,జంగం సాయిలు, రాహుల్, జ్యోతిపాల్, తదితరులు పాల్గొన్నరు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా మన్నెం నరేందర్ రెడ్డి

**వలిగొండ,సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ఎంపీయూపీఎస్ నాతాళ్ల గూడెం లో అక్టోబర్ 17, 2002న ప్రధమ నియామకం కాబడి అక్కడ ఎనిమిది సంవత్సరాలు బోధన చేసి తర్వాత ఎంపీయుపిఎస్ ఎం తుర్కపల్లి మండలం వలిగొండలో రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసి తదనంతరం ఎంపీ యుపిఎస్ లింగరాజు పల్లి వలిగొండ మండలం లో 11 సంవత్సరాల సర్వీసును పూర్తి చేశారు. వీరు సుదీర్ఘంగా వలిగొండ మండలంలోని 20 సంవత్సరాల సర్వీసును పూర్తి చేశారు. ప్రస్తుతం ఎంపీపీ ఎస్ సర్వేలు మండలం నారాయణపురంలో ఎస్జిటిగా విధులను నిర్వహిస్తున్నారు. వీరు 23 సంవత్సరాలుగా అనేకమంది చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారిని భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఉద్యోగంలో స్థిరపడడానికి బలమైన పునాదులు వేశారు. అటు బోధనలో నిమగ్నం అవుతూనే విద్యా రంగంలో ఎమ్మార్పీగా ,డిఆర్పి గా, కే ఆర్ పి గా, డీసీఈబి ప్రశ్నాపత్రాల తయారీలో సేవలందించారు. ఈ ఎల్ ఈ సి మెంటార్గా ఆంగ్ల బోధనలో ఉపాధ్యాయులకు మెలకువలు అందించారు. వీరు రిసోర్స్ పర్సన్



గా పనిచేస్తూ అనేకమంది ఉపాధ్యాయుల ప్రశంసలను పొందారు. అలాగే ఎన్నికల సమయంలో ఎల్ఎంటిగా డిఎల్ఎంటిగా ఎస్ఎల్ఎంటిగా ఎన్నికల విధులలో ప్రభుత్వానికి సేవలను అందించారు. ప్రస్తుతం పాఠశాల బోధనలో నిమగ్నం అవుతూనే అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్ మెంబర్గా విధులను నిర్వహిస్తున్నారు. వీరి సేవలకు గాను మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ,స్కాస్గా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను రిపబ్లిక్ డే సందర్భంగా ఎన్నికల విధులకు గాను ప్రశంసా పత్రాలను గతంలో పొంది ఉన్నారు.

## 1000 బైకులతో కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

**నిర్మల్, సెప్టెంబరు 5 (ప్రజాక్షేత్రం):**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వెయ్యికి పైగా ద్విచక్రవాహనాలతో చేపట్టిన భారీ ర్యాలీతో పట్టణంలో సందడి నెలకొంది. ఉట్నూరు నుంచి బొజ్జు పటేల్ ద్విచక్రవాహన ర్యాలీగా నిర్మల్‌కు చేరుకున్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, నిరుద్యోగులు, అర్హులైన కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్యమంత్రిపై చేస్తున్న విమర్శలను బొజ్జు పటేల్ ఖండించారు. గత పాలనలో రాష్ట్రాన్ని అప్పుల భారంలోకి నెట్టిన వారు ప్రస్తుతం ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసే విమర్శలకు ధీటుగా సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు.

**పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం**

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి విజయోత్సవాల్లో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.






## హమారా ప్రసాద్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

- **అంబేద్కర్ పై ఎవరు తప్పుగా మాట్లాడినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వదలొద్దు**
- **ఎమ్మార్పీఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ సోంపూర్ కే.పోచిరాం**
- **కోటగిరిలో హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు**

**కోటగిరి, సెప్టెంబర్ 05 (ప్రజాక్షేత్రం)**



వారం రోజుల కిందట మన ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై హమర ప్రసాద్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కోటగిరి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కే. పోశెట్టి ఆధ్వర్యంలో శనివారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ నియోజకవర్గం ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ సోంపూర్ కే పోచీరరాం పాల్గొని ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఇంచార్జ్ సోంపుర్ కే పోచీరాం మాట్లాడుతూ ... ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ ను వెంటనే అరెస్టు చేసి ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న హమారా ప్రసాద్ అనే వ్యక్తి ని ఎందుకు శిక్షించడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా హక్కుల కోసం న్యాయం కోసం ఉద్యమాలు చేస్తే ఎంతో మంది ఉద్యమ నాయకుల పై ఎన్నో కేసులు కేసులు పెట్టడం జరిగిందని అంబేద్కర్ పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఇలాంటి వ్యక్తిని ఎందుకు అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకుంటలేరని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇంత పద్ధతిలో బ్రతుకుతున్నామంటే దానికి కారణం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రాయడం వల్లనే నని అయిన గుర్తు చేశారు. హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై ప్రజా సంఘాలు నాయకులు రాజకీయ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎం ఎస్ పి మండల అధ్యక్షుడు పేగులాలయ్య,ఎమ్మార్పీఎస్ నాయకులు వార్డ్ మెంబర్ కన్నం శ్రీనివాస్ గ్రామ అధ్యక్షులు సోనాలి లాలయ్య, యూత్ అధ్యక్షులు దినేష్, కే. సాయిలు, పోశెట్టి,కే. అబ్బయ్య,ఎడ్ల సాయిలు, ఎడ్ల పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులు

- **12వ వార్డు కౌన్సిలర్ అవురం విక్రమ్ రెడ్డి**

**మొయినాబాద్, సెప్టెంబర్ 05 (ప్రజా క్షేత్రం):**

ఉపాధ్యాయులు సమాజానికి నిజమైన మార్గదర్శకులని, జాతి నిర్మాణంలో వారు అందించే సేవలు ఎప్పటికీ మరువలేనివని మొయినాబాద్ 12వ వార్డు కౌన్సిలర్ అవురం విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముర్తుజగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించి, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గురువులను గౌరవించడం అంటే దేశ భవిష్యత్తును గౌరవించడంతో సమానమని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## శ్రీవాణి హైస్కూల్లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

- **నవ సమాజ నిర్మాతలు గురువులు.. పాఠశాల కరస్పాండెంట్ టి.జె.సాయి చరణ్**
- **సమాజానికి వెలుగు రేఖలు ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్**

**ఆత్మకూర్ ప్రతినిధి 5( ప్రజాక్షేత్రం)**

నేడు వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాణి హై స్కూల్ లో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.జె.సాయి చరణ్ మరియు ప్రిన్సిపాల్ లతా మరియు గంగాధర్, అంజనీ మరియు పాఠశాల అడ్వైజర్ డాక్టర్ రాములు మరియు ఉపాధ్యాయులు శాంత,చైతన్య,నాగలక్ష్మి, సువర్ణ, రుచి, తెలుగు తిరుమలేష్, రాజశేఖర్, వెంకటేష్ గౌడ్, నసీమ్, సుభాశీష్ తదితర ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల 10వ.తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను ఆత్మీయంగా సన్మానించుకొని, గురుదక్షిణగా తీపి జ్ఞాపకాలకు గుర్తుగా మెమొంటోను, ఫోటో ఫ్రేమ్ ను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు క్రీడలు నిర్వహించి గెలిచిన బహుమతులను కూడా అందించారు.ఉపాధ్యాయులతో విద్యార్థులు కూడా మమేకమే ఆనందోత్సవాలతో కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల యొక్క ఫోటోలను,కార్యక్రమాలను వీడియో రూపంలో చేసి స్మార్ట్ డిజిటల్ టీవీ ద్వారా విద్యార్థుల ముందు ప్రదర్శన చేసి ఉపాధ్యాయులందరినీ ఆనందపరిచారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురువు అంటే విద్యార్థుల్లో ఉండే అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించేవారు గురువులు. ఈనాటి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 1962 నుంచి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం మొదలైందని గుర్తు చేశారు. మంచి సమాజాన్ని నిర్మించడంలో గురువులదే కీలకమైన బాధ్యత ఉంటుందని గుర్తు చేశారు.ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, ఒక పవిత్రమైన బాధ్యతగా భావిస్తారు. "గురు బ్రహ్మ గురు విష్ణుః" అని పెద్దలు ఊరికే అనలేదు. ఒక మంచి ఉపాధ్యాయునిపై దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది అని తెలియజేస్తూ ,ఈ సందర్భంగా ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## పవిత్రాత్మ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**వలిగొండ, సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని వలిగొండ మండల కేంద్రంలోని పవిత్రాత్మ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సవిత మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని,వారు తమ జీవితాన్ని విద్యార్థులకు ధారపోసి ఉన్నత విద్యను అభ్యసించడానికి కృషి చేస్తున్నటువంటి బాధ్యత ఉపాధ్యాయ వృత్తిపై ఉన్నదని కొనియాడారు.అనంతరం విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఉపాధ్యాయులను అలరింపజేశారు.ఉపాధ్యాయులకు క్రీడలను నిర్వహించి ఉల్లాసపరిచారు.ఈ కార్యక్రమంలో సిస్టర్ జెనిఫర్,సిస్టర్ రోస్,సిస్టర్ లిడియా ,సిస్టర్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




## శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- **రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించిన వాకిటి అనంతరెడ్డి**

**వలిగొండ,సెప్టెంబర్ 05 (ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీ గౌరవ అధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, కాలనీ అధ్యక్షులు భీమిడి యాదిరెడ్డిల ఆధ్వర్యంలో కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేసిన నిస్వార్థ సేవలు ఎంతో విలువైనవని ఈ సందర్భంగా



నాయకులు పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను కమిటీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 50 ఏళ్ల తర్వాత సొంత పాఠశాలలో గురువుకు ఘన సన్మానం

- **గురుపూజోత్సవం సందర్భంగా జనార్దన్ రెడ్డి సార్‌కు అపూర్వ గౌరవం**

**పెద్దేముల్, సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం)**

గురువు–శిష్యుల అనుబంధానికి కాలం ఎప్పటికీ అడ్డుకాదని నిరూపించే అరుదైన సంఘటన పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. సుమారు 50 ఏళ్ల తర్వాత తాను సేవలందించిన సొంత పాఠశాలకు తిరిగి వచ్చిన గురువు జనార్దన్ రెడ్డి సార్‌కు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికి, గురుపూజోత్సవం సందర్భంగా అపూర్వంగా సన్మానించారు.

మంబాపూర్ ప్రాథమిక పాఠశాలలో 1976లో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా జనార్దన్ రెడ్డి సేవలందించారు.అప్పట్లో నాలుగో తరగతి వరకు మాత్రమే ఉన్న పాఠశాలను 6, 7 తరగతులకు అప్‌గ్రేడ్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆయన చేసిన కృషి నేటికీ గ్రామస్తుల జ్ఞాపకాల్లో నిలిచిపోయింది.37 ఏళ్లపాటు విద్యాసేవలు అందించి పదవీ విరమణ చేసి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, 81వ వసంతంలోకి అడుగుపెడుతున్న జనార్దన్ రెడ్డి సార్ సుమారు ఐదు దశాబ్దాల తర్వాత అదే పాఠశాల ప్రాంగణంలో అడుగుపెట్టారు. తమకు అక్షరాలు నేర్పిన గురువును చూసిన పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. నాటి శిష్యులు నేడు వివిధ రంగాల్లో స్థిరపడినా, తమ జీవితానికి బాటలు వేసిన గురువును మాత్రం మరచిపోలేదని ఈ సన్మానం చాటిచెప్పింది.

**గురువు అడుగుపెట్టగానే జ్ఞాపకాల వెల్లువ**

పాఠశాలకు చేరుకున్న జనార్దన్ రెడ్డి సార్‌కు పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. నాటి తరగతి గదులు, పాఠశాల ప్రాంగణాన్ని చూసిన ఆయన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువును శిష్యులు సన్మానించడం, గురువు తన శిష్యులను ఆప్యాయంగా పలకరించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను జనార్దన్ రెడ్డి సార్ చేతుల మీదుగా సన్మానించారు.



**సేవలకు గుర్తింపుగా రామానుజమ్మకు సన్మానం**

అదే కార్యక్రమంలో మంబాపూర్ గ్రామానికి చెందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామానుజమ్మ పదవీ విరమణ సందర్భంగా ఆమెను కూడా ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందించిన వైద్య, ఆరోగ్య సేవలను పలువురు కొనియాడారు. గ్రామానికి సేవలందించిన గురువు, ఆరోగ్య కార్యకర్తలను ఒకే వేదికపై సత్కరించడం కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రకాశం, సోషల్ వర్కర్ కేవీఎం వెంకట్, ఉపాధ్యాయులు వీరప్ప, భాగ్యలక్ష్మి, రాధిక, బలమణి, మొగులమ్మ, ఇస్మాయిల్, భారతమ్మ, జుంటిపల్లి అంజలయ్య, దిలీప్ కుమార్, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణుడి వేషంలో చిన్నారి.. చూపరులను ఆకట్టుకున్న ముద్దుగుమ్మ

**పెద్దేముల్, సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం)**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో సందడి చేశారు.ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పి.నారాయణ రెడ్డి ముని మనుమరాలు 8 నెలల మీనాక్షి శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చిన్నారి కృష్ణుడి వేషధారణలో ఎంతో ముద్దుగా ముస్తాబై, నెమలి పింఛం, కిరీటం,వేణువుతో దర్శనమివ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఎంతో ఆనందించారు.చిన్నారి చిరునవ్వులు, చిలిపి చేష్టలు, కృష్ణుడి వేషంలో ఆమె చూపిన హావభావాలు అందరినీ ఆకట్టుకున్నాయి.చిన్నారి కృష్ణవేషధారణను చూసిన వారు “బాలకృష్ణుడే ప్రత్యక్షమైనట్లుంది” అంటూ మురిసిపోయారు .ఈ సందర్భంగా చిన్నారిని కుటుంబ సభ్యులు ప్రేమగా ఆశీర్వదిస్తూ, ఆమె కృష్ణుడి వేషధారణలో ఉన్న ఫొటోలను ముచ్చటగా తీసుకున్నారు. పండుగలు కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా చిన్నారుల్లో మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. చిన్నారి కృష్ణవేషధారణకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం గ్రామంలో పలువురిని ఆకట్టుకుంటున్నాయి.



## వివేకానంద యువ కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా వంగరి రఘు

**సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 05(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం వివేకానంద యువ కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా వంగరి రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువ కేంద్ర అధ్యక్షులు రాపర్తి వెంకటేష్ గౌడ్,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.

**నూతన కమిటీ వివరాలు:**

అధ్యక్షులు, వంగరి రఘు,ఉపాధ్యక్షులు గొల్లూరి యాదయ్య సాగర్,ప్రధాన కార్యదర్శి సురపల్లి వెంకటేశం,కోశాధికారి రాపర్తి కరుణాకర్ గౌడ్,సభ్యులు,రాపర్తి రమేష్ గౌడ్,పాలకూర్ల వెంకటేష్ గౌడ్,వీరమల్ల జంగయ్య గౌడ్,సురేపల్లి శివాజీ,విడం సాయి కిషోర్,నెర్లకంటి నాగరాజు,సింగం భాస్కర్,మొగుదాల వెంకటేష్ గౌడ్,మద్ది సంజీవ,పాలకూర్ల శివ,కోగూరి శ్రవణ్ కుమార్,గొల్లూరు సాయి,అచ్చిని ప్రవీణ్, దూసరి వెంకటేష్ గౌడ్,అచ్చిని రవి,సింగం కృష్ణ,తదితరులు,ఉన్నారు.



## గణేష్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

**భువనగిరి, సెప్టెంబరు 5 (ప్రజాక్షేత్రం):**

భువనగిరి పట్టణ గణేష్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ మాజీ అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం రెండేళ్ల పదవీకాలం పూర్తికావడంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి భువనగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా పసుపునూరి నాగభూషణం, ఉపాధ్యక్షులుగా పాదరాజు ఉమాశంకర్, కిమోజు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శులుగా జెగ్రిపోతుల భరత్, బెల్లంకొండ చంద్రకాంత్, కోశాధికారులుగా గాయపాక పృథ్వి, కూర నరేందర్‌లను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాగభూషణం మాట్లాడుతూ.. రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా, ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. గతంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖలు, వ్యవస్థల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వివిధ హిందూ సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు, గణపతి మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలను అరికట్టాలి సిపిఎం ధర్నా

**వలిగొండ, సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం విద్యుత్ కోతలను అరికట్టి గతంలో ఇచ్చిన విధంగా 18 గంటల కరెంటును రైతాంగానికి అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు

శనివారం వలిగొండ మండల కేంద్రంలోని విద్యుత్ అధికారి కార్యాలయం ముందు సిపియం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన 18 గంటల విద్యుత్ ను 12 గంటల నుండి 8 గంటల లోపు తగ్గించిందని దీనివల్ల ప్రస్తుతం రైతుల వరి పంట పొట్టదశకు చేరుకున్న సమయంలో కంకి చేతి కిందనే పరిస్థితులు ఏర్పడతాయని దీనితో ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చి రైతులకు తీవ్రంగా నష్టపోతారని వెంటనే గతంలో ఇచ్చిన మాదిరిగా 18 గంటల కరెంటును అందించాలని డిమాండ్ చేశారు మండలంలో కొన్ని సబ్ స్టేషన్ ల పరిధిలోని కేవలం 7,8 గంటలకే పరిమితం చేస్తున్నారన్నారు వెంటనే రైతాంగానికి నష్టం చేసే చర్యలకు స్వస్తి చెప్పి సరైన విద్యుత్తును అందించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండే కిష్టయ్య,కలుకూరి రామచందర్, భీమనబోయిన జంగయ్య,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,రైతు సంఘం నాయకులు మంగ బాలయ్య,కందగట్ల సాయి రెడ్డి, దయ్యాల మల్లేశం,చేగురి నరసింహ,కొండూరు సత్తయ్య,వట్టిపెల్లి చంద్రయ్య, ధ్యానబోయిన యాదగిరి, నారీ వెంకటేశం,పెద్దబోయిన భీమరాజు,దేశపాక రవి,నగేష్,రాజు,తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా పోత లింగన్న స్వామి బొడ్రాయి పునర్నిర్మాణం

- **కాముని కంతలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.**
- **పాల్గొన్న కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ దంపతులు**

**భువనగిరి,సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

భువనగిరిపట్టణంలోని 23వ వార్డు కాముని కంత ప్రాంతంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్థానికుల ఆరాధ్య దైవంగా కొలిచే పోత లింగన్న స్వామి బొడ్రాయి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పునర్నిర్మాణంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో 1 బర్రె పూజిత 23 వ వార్డు కౌన్సిలర్, బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించి, కాముని కంత ప్రాంత ప్రజలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించారు. తరతరాలుగా ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఇలాంటి ఆధ్యాత్మిక ప్రదేశాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.

ప్రజల విశ్వాసమే వార్డు బలం..సంప్రదాయాల పరిరక్షణే తమ లక్ష్యం అని స్పష్టం చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు కూడా కృషి చేస్తామని తెలిపారు.

బొడ్రాయి పునర్నిర్మాణ కార్యక్రమంతో కాముని కంత ప్రాంతంలో భక్తి వాతావరణం నెలకొనగా, స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో పోత లింగన్న కమిటీ సభ్యులు మాటూరు బిక్షపతి గౌడ్, నక్కల జగదీష్ యాదవ్,డొంకేనా శ్రీనివాస్ గౌడ్,పబ్బతి హరికిషన్ గౌడ్, బండారు రవివర్ధన్ ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఉడత దుర్గ ప్రసాద్ గౌడ్, ఎంగి సాయి,పోకల నాగరాజు,నామగోని అమర్ గౌడ్, కసర బోయిన సాయి యాదవ్, వార్డు మహిళలు, ప్రజలు పాల్గొని పోత లింగన్న ఆశీస్సులు పొందారు.





## 22ఏ సమస్యలపై భాజపా మహా దీక్ష

- **ఇందిరాపార్క్‌కు పెద్దకొడప్‌గల్ నేతల పయనం**

**పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 5 (ప్రజాక్షేత్రం):**

భూభారతి చట్టంలోని అవకతవకలు, 22ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భాజపా ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న మహా దీక్షకు పెద్దకొడప్‌గల్ మండలానికి చెందిన భాజపా నాయకులు శనివారం బయలుదేరారు.
ఈ సందర్భంగా మండల భాజపా అధ్యక్షుడు మల్లయ్యల సుభాష్ మాట్లాడుతూ.. భూ రికార్డులు, హక్కులకు సంబంధించిన సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 22ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన భాజపా నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.
మహా దీక్షలో మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్, హన్మండ్లు, సంగప్ప పటేల్, నాందేవ్ పటేల్, మోహన్, తానాజీరావు, అశోక్, రామగౌడ్, జెతిలాల్, సిద్ధు, సాయి తదితరులు పాల్గొన్నారు.



## శాంతినికేతన్ లో ఉపాధ్యాయ దినోత్సవం

- **ఉత్తమ పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులది**
- **మాలి పటేల్ ప్రభు**

**సంగారెడ్డి,సెప్టెంబర్ 05( ప్రజా క్షేత్రం):**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం నందు శాంతినికేతన్ విద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాలిపటేల్ ప్రభు,పాఠశాల కరస్పాండెంట్ మాలి పటేల్ అరవింద శ్రీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికి పూలమాలవేసి వారి తోపాటు ఇతర ఆదర్శ ఉపాధ్యాయుల జీవిత ఘట్టంలోని అంశాలను పాఠశాల ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించినారు. సమాజం ఉన్నత స్థాయికి, ఉత్తమ స్థాయికి ఎదగాలంటే ఉపాధ్యాయ వృత్తి ఎంచుకున్న ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థి అభివృద్ధికి కృషి చేసి ఉత్తమ విద్యను అందించి అత్యున్నత స్థాయికి అన్ని రంగాల్లో విద్యార్థులను ఎదిగేలా ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేసి ప్రత్యేక బహుమతులు అందించి ఉపాధ్యాయులు ఆశీస్సులు తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమమునందు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుప్రియ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



## ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**చౌటుప్పల్ ,సెప్టెంబర్ 05(ప్రజా క్షేత్రం):**

చౌటుప్పల్ ట్రినిటీ హైస్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిపారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయ స్థాయి నుండి భారతదేశం మొదటి పౌరుడు రాష్ట్రపతి వరకు అంచలంచలుగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరంగా వివరించారు అలాగే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన ము ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు అలాగే విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వివరించారు స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వివరించి విద్యార్థులకు బోధన చేశారు ఒకరోజు ఉపాధ్యాయుల గా వివరించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అభినందించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ గాంధీ గ్లోబల్ చైర్మన్ వెన్‌రెడ్డి సంధ్య స్కూల్ చైర్మన్ కెవిబి కృష్ణారావు కోఆర్డినేటర్స్ ఎం శివరాణి శివాని నీరజ మంజుల స్వప్న కొండమ్మ జ్యోతి సబిత లో కుమారి స్వప్న అనూష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**భువనగిరి, సెప్టెంబరు 5(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గ్రామం వెల్మజాల ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్మజాల లో AAPC చైర్మన్ సౌజన్యంతో ఉపాధ్యాయ దినోత్సవం చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కురుమిళ్ళ కవితా శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ శ్రీ కచ్చిగళ్ళ మహేందర్, పాఠశాల చైర్మన్ శ్రీమతి బొడ్డుపల్లి రేణుక మరియు వికలాంగుల హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సింగారం రమేష్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరికీ పూలు మరియు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు మరియు అతిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కలిసి భారత దేశ చరిత్రను మార్చవచ్చని తెలిపారు విద్య అన్నిటికి మూలం అని జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలని అదే విధంగా బాగా చదివి విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశించారు.



# వికారాబాద్‌కు దక్కిన గౌరవం..

- **గురువుకు వందనం.. దేశ భవిష్యత్తుకు దిక్సూచి!**
- **రాధాకృష్ణన్ నుంచి నేటి గురువుల వరకు.. అక్షరం నేర్పిన చేతులకు జాతి సెల్యూట్**
- **ఢిల్లీ నుంచి తెలంగాణలో కొడంగల్ వరకు గురుపూజోత్సవ వేడుకలు**

**వికారాబాద్ బ్యూరో సెప్టెంబర్ 5( ప్రజాక్షేత్రం )**

దేశ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజు. పాఠశాలలో అక్షరం నేర్పిన గురువు నుంచి విశ్వవిద్యాలయంలో జ్ఞానాన్ని పంచే అధ్యాపకుడి వరకు విద్యారంగానికి సేవలందిస్తున్న ప్రతి ఒక్కరినీ గౌరవించే రోజు. భారతదేశంలో సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడానికి కారణం మహనీయుడు, తత్వవేత్త, విద్యావేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం. 1888 సెప్టెంబర్ 5న జన్మించిన రాధాకృష్ణన్ జీవితంలో అత్యున్నత స్థానాలను అధిరోహించినప్పటికీ తనను తాను ముందుగా ఒక ఉపాధ్యాయుడిగానే భావించారు. ఆయన పుట్టినరోజును వ్యక్తిగత వేడుకగా కాకుండా ఉపాధ్యాయులను గౌరవించే రోజుగా జరుపుకోవాలనే భావనతో సెప్టెంబర్ 5 గురువుల దినోత్సవంగా ప్రత్యేక గుర్తింపు పొందింది.

**గురువు అంటే ఉద్యోగం కాదు.. ఒక తరం నిర్మాణం**

గురువు చేతిలో ఉన్నది కేవలం చాక్‌పీస్ కాదు.. ఒక విద్యార్థి భవిష్యత్తు. పుస్తకంలోని పాఠాన్ని చెప్పడం మాత్రమే ఉపాధ్యాయుడి బాధ్యత కాదు. విద్యార్థిలో ఆలోచనా శక్తిని పెంచడం, ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించడం, మంచి చెడులను గుర్తించే వివేకాన్ని కల్పించడం, ఓటమిలో ధైర్యం చెప్పడం, విజయానికి వినయాన్ని జోడించడం గురువు చేసే అసలైన పని. అందుకే ఒక మంచి గురువు ఒక విద్యార్థిని మాత్రమే కాదు.. ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, చివరికి ఒక దేశాన్ని ప్రభావితం చేయగలడు.

**ఢిల్లీలో జాతీయ గౌరవం**

2026 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో జాతీయ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా ఎంపికైన 48 మంది పాఠశాల ఉపాధ్యాయులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ అవార్డులు అందించారు. వీరు విద్యలో వినూత్న పద్ధతులు, సమగ్ర విద్య, సాంకేతిక వినియోగం, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సేవలు వంటి విభాగాల్లో విశిష్ట కృషి చేసినవారు. అదే సమయంలో ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌లకు చెందిన 21 మంది అధ్యాపకులకు కూడా జాతీయ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు. వీరిలో కేంద్ర ఉన్నత విద్యా సంస్థల నుంచి 12 మంది, రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి 5 మంది, పాలిటెక్నిక్‌ల నుంచి 4 మంది ఉన్నారు.

**జాతీయ అవార్డుల వెనుక 1958 నుంచి కొనసాగుతున్న సంప్రదాయం**

దేశంలో జాతీయ ఉపాధ్యాయ అవార్డుల పథకం 1958లో ప్రారంభమైంది. ప్రాథమిక, మధ్య, మాధ్యమిక పాఠశాలల్లో విశిష్ట సేవలు అందించే ఉపాధ్యాయులకు ప్రజా గుర్తింపు కల్పించడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఈ అవార్డులను ప్రదానం చేసే సంప్రదాయం కొనసాగుతోంది.

**తెలంగాణలో 123 మంది.. కొడంగల్ వేదికగా రాష్ట్రస్థాయి గురుపూజోత్సవం**

తెలంగాణలో ఈ ఏడాది 123 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య నుంచి 52 మంది, విశ్వవిద్యాలయాల నుంచి 28 మంది, అనుబంధ కళాశాలల నుంచి 29 మంది, ఇంటర్మీడియట్ విద్య నుంచి 11 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల నుంచి 3 మంది ఉన్నారు. వీరితో పాటు విద్యారంగంలో విశిష్ట సేవలకు ముగ్గురు అధికారులను ఎక్సలెన్స్ అవార్డులకు ఎంపిక చేశారు.
ఈసారి తెలంగాణ రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవానికి మరో ప్రత్యేకత ఉంది. సాధారణంగా హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఈసారి వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే రాష్ట్రస్థాయి వేడుకగా కొడంగల్ నిలిచింది. దీంతో వికారాబాద్ జిల్లా విద్యా చరిత్రలో ఈ సెప్టెంబర్ 5కు ప్రత్యేక స్థానం లభించింది.

**వికారాబాద్‌కు దక్కిన గౌరవం..**

రాష్ట్రస్థాయి గురుపూజోత్సవానికి వేదికగా వికారాబాద్ జిల్లా కొడంగల్ ఎంపిక కావడం జిల్లాకు ప్రత్యేక గౌరవం.

**విజయవాడలో చంద్రబాబు చేతుల మీదుగా గురువులకు గౌరవం**

ఆంధ్రప్రదేశ్‌లోనూ సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సన్మాన కార్యక్రమం నిర్వహించింది. తాజా సమాచారంలో ఏపీ అవార్డుల మొత్తం 175 వివరాల్లో పాఠశాల విద్య 79, ఇంటర్మీడియట్ 24, పాలిటెక్నిక్ 14, విశ్వవిద్యాలయాలు 35, డిగ్రీ కళాశాలలు 17, ఇంజినీరింగ్-ఫార్మసీ కళాశాలలు 6గా ఉన్నాయి. మరో వార్తా నివేదిక మాత్రం 173 మందిగా పేర్కొంది. అందువల్ల అధికారిక తుది జాబితాను బట్టి మాత్రమే ఒక సంఖ్యను ఖరారు చేయాల్సి ఉంటుంది. విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

**ఉమ్మడి రంగారెడ్డి నుంచి వికారాబాద్ వరకు.. గురువుల సేవకు సుదీర్ఘ చరిత్ర**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల విద్యను ముందుకు తీసుకెళ్లడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎన్నటికీ మరువలేనిది. కాలక్రమంలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణతో వికారాబాద్ ప్రత్యేక జిల్లాగా ఏర్పడినా.. గ్రామీణ విద్యార్థులకు విద్యను అందించడంలో ఉపాధ్యాయుల సేవ కొనసాగుతూనే ఉంది. మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలకు చేరుకోవడానికి కిలోమీటర్ల దూరం నడిచిన గురువులు, పేద విద్యార్థులకు సొంత ఖర్చుతో పుస్తకాలు అందించిన ఉపాధ్యాయులు, చదువు మానేయబోతున్న పిల్లలను తిరిగి బడికి తీసుకొచ్చిన గురువులు ఎంతోమంది ఉన్నారు. వారికి అవార్డు రాకపోయినా వారి సేవ విలువ తగ్గదు.

**కాలం మారింది.. గురువు పాత్ర మరింత పెరిగింది**

ఇప్పుడు విద్యార్థి చేతిలో పుస్తకంతో పాటు స్మార్ట్‌ఫోన్ ఉంది. ఇంటర్నెట్ ఉంది. కృత్రిమ మేధస్సు ఉంది. ఒక్క క్షణంలో వేల సమాధానాలు దొరుకుతున్నాయి. కానీ ఏది నిజం? ఏది తప్పు? ఏ సమాచారం ఉపయోగకరం? దాన్ని ఎలా విశ్లేషించాలి? అనే వివేచనను పెంచాల్సిన బాధ్యత మాత్రం గురువుదే. అందుకే సాంకేతికత పెరిగిన కొద్దీ గురువు అవసరం తగ్గలేదు.. మరింత పెరిగింది. జాతీయ అవార్డు గ్రహీతలలో కూడా సాంకేతికతను బోధనలో వినూత్నంగా ఉపయోగించిన ఉపాధ్యాయులకు గుర్తింపు రావడం ఈ మార్పుకు నిదర్శనం.

**అసలైన గురుదక్షిణ ఏమిటి?**

గురువుకు పూలు ఇవ్వడం గొప్పదే. శాలువా కప్పడం గౌరవమే. అవార్డు అందించడం గుర్తింపే. కానీ గురువు నేర్పిన విలువలను జీవితంలో ఆచరించడం అసలైన గురుదక్షిణ. ఒక విద్యార్థి నిజాయితీగా ఎదిగితే.. సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా మారితే.. తనకంటే వెనుక ఉన్న మరో విద్యార్థికి చేయూతనిస్తే.. అదే గురువుకు లభించే అత్యున్నత గౌరవం.
దేశంలో ఈరోజు 48 మంది పాఠశాల ఉపాధ్యాయులకు జాతీయ గౌరవం లభించింది. మరో 21 మంది ఉన్నత విద్య, పాలిటెక్నిక్ రంగాల అధ్యాపకులకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. తెలంగాణలో 123 మంది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు సన్మానం పొందుతున్నారు. కొడంగల్ రాష్ట్రస్థాయి గురుపూజోత్సవానికి వేదికగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ వేదికగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఈ వేడుకలన్నింటి వెనుక ఉన్న అసలు సందేశం ఒక్కటే—గురువును గౌరవించడం అంటే విద్యను గౌరవించడం.. విద్యను గౌరవించడం అంటే దేశ భవిష్యత్తును గౌరవించడం.
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాష్ట్రపతిగా చరిత్రలో నిలిచిపోయారు. కానీ ఆయన జన్మదినం దేశంలోని ప్రతి గురువుకు అంకితమైన రోజుగా మారడం ఆయన జీవితానికి లభించిన అత్యంత గొప్ప గౌరవం. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుంది. ఆ భవిష్యత్తుకు రూపకర్త గురువు.
"గురువు చేతిలో చాక్‌పీస్ కాదు.. ఒక తరం భవిష్యత్తు!"
"గురువుకు గౌరవం ఉంటే.. దేశ భవిష్యత్తుకు భద్రత ఉంటుంది!"

**ఎం. రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**











## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

- **నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా**

**పెద్దేముల్, సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం)**

నిరుపేద, పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా అన్నారు.శనివారం పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి లక్ష్మీ యాదయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్.ఎల్లారెడ్డి, పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తాలు పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమ్మరి సాయిలుతో కలిసి హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు.అనంతరం కుమ్మరి లక్ష్మీ యాదయ్య దంపతులను కాంగ్రెస్ నాయకులు అభినందించి, నూతన గృహంలో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎన్.ఎల్లారెడ్డి, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు చేయూత అందిస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులైన ప్రతి కుటుంబం పక్కా ఇల్లు నిర్మించుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.సొంత ఇల్లు కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భరోసాను కల్పించే చిరునామా అని వారు అన్నారు. కుమ్మరి లక్ష్మీ యాదయ్య దంపతులు నూతన ఇందిరమ్మ ఇంటిలో గృహప్రవేశం చేసుకోవడం సంతోషకరమని,వారి కుటుంబంలో ఈ నూతన గృహం సుఖసంతోషాలు, శ్రేయస్సు, అభివృద్ధికి వేదిక కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమ్మరి సాయిలు, పెద్దేముల్ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సయ్యద్ షబ్బీర్,మాజీ వార్డు సభ్యుడు దబ్బుల నర్సింహులు, కోళ్ల గోపాల్, సంజీవ్ కుమార్, కుటుంబ సభ్యులు కుమ్మరి వెంకటయ్య, కుమ్మరి బందెయ్య,తదితరులు పాల్గొన్నారు.

## గురువు చేతిలోనే భావితరాల భవిష్యత్తు

- **స్వామి వివేకానంద పాఠశాలలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**
- **ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించిన పాఠశాల యాజమాన్యం**
- **విద్యార్థి భవిష్యత్తుకు గురువు వేసే పునాదే బలమైన పునాది**
- **స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ పి.జయంతి**

**పెద్దేముల్, సెప్టెంబర్ 5 (ప్రజా క్షేత్రం)**

విద్యార్థి జీవితానికి గురువు వేసే పునాది.. అతని భవిష్యత్తుకు బలమైన పునాది అని స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ పి.జయంతి అన్నారు.గురువు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని, విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, అతని కలలకు రెక్కలు తొడిగి ఉన్నత శిఖరాల వైపు నడిపించే మార్గదర్శి అని ఆమె పేర్కొన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం తరపున ప్రిన్సిపాల్ పి.జయంతి,కరస్పాండెంట్ కే.కరుణాకర్ రెడ్డిలు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందచేసి వారి సేవలను అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.జయంతి, కరస్పాండెంట్ కే.కరుణాకర్ రెడ్డిలు మాట్లాడుతూ..ఒక విద్యార్థి చేతిలో పుస్తకం పెట్టి అక్షరాలు నేర్పడంతోనే గురువు బాధ్యత పూర్తికాదన్నారు.ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, ఆ ప్రతిభకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేలా చేయడమే నిజమైన గురువు బాధ్యత అని తెలిపారు.అలాంటి గురువుల




సేవలను స్మరించుకునే గొప్ప రోజే సెప్టెంబర్ 05 ఉపాధ్యాయ దినోత్సవమని పేర్కొన్నారు. "ఈరోజు విద్యార్థులకు పాఠాలు చెప్పే గురువే.... రేపు వారు సాధించిన విజయాన్ని చూసి గర్వపడే వ్యక్తి" అని వారు పేర్కొంటూ గురువు-విద్యార్థి మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని వివరించారు.విద్యార్థి డాక్టర్‌గా, ఇంజనీర్‌గా, ప్రభుత్వ ఉన్నతాధికారిగా లేదా ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి ఎదిగినా, ఆ విజయానికి తొలి అడుగులు వేయించేది గురువేనని గుర్తు చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే.. గురువు వారి జీవితానికి దిశా నిర్దేశం చేస్తారని అన్నారు.విద్యార్థి విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగంతో పాటు, ప్రతిరోజూ అతని భవిష్యత్తు గురించి ఆలోచించే గురువు శ్రమ కూడా ఉంటుందని తెలిపారు.విద్యార్థి మంచి మార్కులు సాధించినప్పుడు, ఉన్నత స్థానానికి చేరుకున్నప్పుడు తన శ్రమ ఫలించిందని అత్యంత ఆనందించే వ్యక్తి గురువు మాత్రమేనని అన్నారు.ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఆయన జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం వెనుక ఉన్న విశిష్టతను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు తమ గురువులను గౌరవిస్తూ,వారు చూపిన మార్గంలో నడిచి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరిసుధన్ రెడ్డి, అశోక్, నరేష్ రెడ్డి, సునీత, వెంకటలక్ష్మి,అప్సానా,కల్పన, నిర్మల, అంజలితో పాటు పాఠశాల విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రేసులో పోత్నాక్ ప్రమోద్ కుమార్

**భువనగిరి సెప్టెంబర్ 05 ( ప్రజా క్షేత్రం )**

పార్టీ కోసం 40 ఏళ్ల సేవలకు గుర్తింపుగా పోత్నాక్ ప్రమోద్ కుమార్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్...!

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశావహుల జాబితాలో భువనగిరికి చెందిన సీనియర్ నాయకుడు పోత్నాక్ ప్రమోద్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

గత నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వచ్చిన ప్రమోద్ కుమార్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, సీనియర్ కాంగ్రెస్ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోత్నాక్ ప్రమోద్ కుమార్‌కు అవకాశం కల్పిస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత, విద్యావంతులతో ఉన్న అనుబంధం, ప్రజా సమస్యలపై అవగాహన వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అయితే కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుందన్నది ఆసక్తికరంగా మారగా, పార్టీ కార్యకర్తలు మాత్రం పోత్నాక్ ప్రమోద్ కుమార్ పేరును బలంగా ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం.

## తిరుమలయ్యగుట్టపై పటిష్ట బందోబస్తు

- **వృద్ధ భక్తురాలిని క్షేమంగా కిందికి తీసుకొచ్చిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు**
- **భక్తుల భద్రతపై ఎస్సై హృషికేష్ నిరంతర పర్యవేక్షణ**

**వనపర్తి, సెప్టెంబరు 5(ప్రజా క్షేత్రం):**

శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా తిరుమలయ్యగుట్టపై భక్తుల సందడి నెలకొంది.

శ్రీ తిరుమలనాథ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ సునితారెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ పరిసరాలు, మెట్ల మార్గాలు, క్యూ లైన్లు, భక్తుల రాకపోకలు, వాహనాల రద్దీ, పార్కింగ్ ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు.

**వృద్ధ భక్తురాలికి పోలీసు చేయూత**

బందోబస్తు విధుల్లో ఉన్న పానగల్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు మానవీయతను చాటుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఓ వృద్ధ భక్తురాలు మెట్లు దిగలేక ఇబ్బందిపడుతుండటాన్ని గమనించిన ఆయన వెంటనే స్పందించారు. వృద్ధురాలికి సహాయం అందించి, ఆమెను క్షేమంగా ఎత్తుకుని మెట్ల మార్గం ద్వారా కిందికి తీసుకొచ్చారు. అనంతరం సురక్షితంగా ఉండేలా సహకరించారు. విధి నిర్వహణలో భాగంగా చూపిన ఈ సేవాభావాన్ని అక్కడున్న భక్తులు అభినందించారు.

**భక్తుల భద్రతపై ఎస్సై నిరంతర పర్యవేక్షణ**

భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఎస్సై హృషికేష్ స్వయంగా బందోబస్తు ప్రాంతాల్లో పర్యటించారు. క్యూలైన్లు, మెట్ల మార్గం, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చినప్పటికీ పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు. ముందస్తు భద్రతా చర్యలు, పటిష్ట బందోబస్తు, నిరంతర పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దర్శన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని ఎస్సై హృషికేష్ తెలిపారు.



## అసెంబ్లీకి రాని కేసీఆర్ రాజీనామా చేయాలి

- **ఈసీఐఎల్‌లో కాంగ్రెస్ నిరసన**

**కుషాయిగూడ, సెప్టెంబరు 5(ప్రజా క్షేత్రం):**

శాసనసభకు హాజరుకాని మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈసీఐఎల్ చౌరస్తాలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. నేడు ఇందిరాపార్కు వద్ద జరిగే నిరసన సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆనంద నిలయంగా కొండలయ్య క్షేత్రం

- **శ్రావణ మాసపు చివరి శనివారం ప్రత్యేక పూజలు**
- **గోవింద నామస్మరణతో మార్మోగిన జగత్‌పల్లి కొండ**
- **భారీగా తరలివచ్చిన భక్తులు..**
- **అన్నదానంతో పునీతమైన క్షేత్రం**

**వనపర్తి,సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

శ్రావణ మాసపు చివరి శనివారం సందర్భంగా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామంలోని కొండలయ్య గుట్ట భక్తజన సందోహంతో కిటకిటలాడింది. గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తుల గోవింద నామస్మరణతో ఆనంద నిలయంగా మారింది. జగత్‌పల్లి గ్రామస్తులతో పాటు వనపర్తి మండలంలోని రాజనగరం, నాగవరం, రాజపేట, వనపర్తి పట్టణం తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

**గోవింద నామస్మరణతో మార్మోగిన గుట్ట**

ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక పెరగడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. గుట్ట దిగువన కొలువైన అభయాంజనేయ స్వామివారిని తొలుత దర్శించుకున్న భక్తులు.. అనంతరం 'ఏడుకొండలవాడా.. వెంకటరమణా..గోవిందా..గోవిందా' అంటూ నామస్మరణ చేస్తూ కొండపైకి చేరుకున్నారు. గోవింద నామస్మరణతో కొండను అధిరోహించిన భక్తులు స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. భక్తుల కోలాహలంతో కొండలయ్య గుట్ట తిరుమల క్షేత్రాన్ని తలపించింది.

**ప్రత్యేక పూజలు**

శ్రావణ శనివారం స్వామివారిని దర్శించుకుంటే పాపాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**అన్నదానంతో పునీతం**

భక్తుల కోసం జగత్‌పల్లి గ్రామానికి చెందిన దాత గట్టు నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నదానంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందించడంతో కార్యక్రమం భక్తిభావంతో సాగింది. అన్నదానం చేసిన గట్టు నాయుడుకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖుల పాల్గొనడం

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంటన్న యాదవ్, మాజీ సర్పంచులు మోహన్‌కుమార్ యాదవ్, నిరంజన్‌గౌడ్, నారాయణ యాదవ్, గ్రామ ప్రముఖులు బూరుగుపల్లి శ్రీనివాసరెడ్డి, జి. శ్రీనివాస యాదవ్, వార్డు సభ్యుడు మోజర్ల రాములు, కుమార్ యాదవ్, దత్తాత్రేయరెడ్డి, కృష్ణసాగర్, సురేష్‌చారి, బుచ్చన్న నాయుడు, వెంకటేష్ నాయుడు, తుప్పుడ భాస్కర్ యాదవ్, తిరుపతి నాయుడు, కృష్ణుడు, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



# చందాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- **విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులదే కీలక పాత్ర**
- **ప్రధానోపాధ్యాయుడు కే. బొజ్జిబాబు**

**వనపర్తి, సెప్టెంబరు 5 (ప్రజా క్షేత్రం) :**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వనపర్తి మండలం చందాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కే. బొజ్జిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సందడి నెలకొంది.

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. వివిధ అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులను అందజేశారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

**విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి**

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కే. బొజ్జిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగుతూ విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యతో పాటు మంచి నడవడి, క్రమశిక్షణ, మానవతా విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

**సీనియర్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం**

అనంతరం పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు డి. శ్రీనివాస్‌రెడ్డిని ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల ప్రగతికి ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ వారి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు.

**విద్యార్థుల ఉత్సాహం**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో తమ ప్రతిభను చాటడంతో ఉపాధ్యాయులు వారిని అభినందించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. బాలనాగయ్య, వై. విష్ణు, పి. మంజుల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు సందడిగా సాగాయి.





# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- **ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయాలి**
- **ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్వీ**
- **విద్యార్థి నాయకులు**

**వనపర్తి, సెప్టెంబర్ 5(ప్రజా క్షేత్రం):**

విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్వీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ డిమాండ్ చేశారు .

రాష్ట్ర ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో వనపర్తిలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, విద్యా భరోసా కార్డు, యువజన కమిషన్, వడ్డీలేని రుణాలు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విదేశీ విద్యకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 97వ ప్రభుత్వ ఉత్తర్వుపై పునఃపరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్వీ వనపర్తి ఇన్‌చార్జి సూర్యవంశం గిరి, బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి సునీల్ వాల్మీకి, శివగౌడ్, సిరివాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మాజీ కౌన్సిలర్ ఉంగుళం తిరుమల్ తదితరులు మాట్లాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను త్వరగా విడుదల చేయడంతోపాటు యువజన ప్రకటనలో పేర్కొన్న హామీలను దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రేమనాథ్‌రెడ్డి, చిట్యాల రాము, గాలిగల్ల క్రాంతి కుమార్, జీవీ ప్రసాద్, విజయ్‌మోహన్, అలీమ్, జోయబ్‌హుస్సేన్, యుగంధర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజ్, బేధడి కుమార్, ఇమ్రాన్, మునికుమార్, అస్లాం, అఖిలేందర్, చంద్రశేఖర్, మంద రాము, రవి, సంతోష్‌తో పాటు పట్టణ, మండల నాయకులు, సర్పంచులు, బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## మంచి సమాజ నిర్మాణంలో గురువులదే కీలక పాత్ర

- **గురువులే విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు**
- **విద్యార్థుల భవితకు ఉపాధ్యాయులే బాటసారులు**

**మేడ్చల్–మల్కాజ్‌గిరి, సెప్టెంబరు 5(ప్రజా క్షేత్రం):**

విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ శనివారం జిల్లా కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం, విషయ పరిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేలా బోధన సాగాలన్నారు. పుస్తకాలు జ్ఞానాన్ని అందిస్తే.. దాన్ని జీవితంలో ఎలా ఉపయోగించుకోవాలో నేర్పేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థుల లోపాలను సరిదిద్ది, నైపుణ్యాలను వెలికితీసి సులభమైన పద్ధతిలో బోధించాలని సూచించారు. ప్రతిరోజూ విద్యార్థులతో కనీసం 5 నుంచి 10 నిమిషాలు దినపత్రికలు చదివించేలా చూడాలని, తద్వారా సామాజిక అవగాహనతో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు.

అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు, పూల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394